ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కాకినాడ

జిల్లా వార్తలు

శుక్రవారం 13 డిసెంబరు 2024 | 5

గగనంలో ఛలో ఛలో ఢిల్లీకి..



ప్రొటోకాల్‌లో భాగంగా తొలి విమాన సర్వీసుపై వాటర్‌ను వెదజల్లుతూ స్వాగతిస్తున్న దృశ్యం



రాజమహేంద్రవరం నుంచి ఢిల్లీకి ఇండిగో తొలి విమాన సర్వీసుకు మొదటి టిక్కెట్‌ను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కుమారుడు సంజీవ్‌కు అందిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీలు, ఎమ్మెల్యేలు

రాజమహేంద్రవరం నుంచి ఢిల్లీకి విమానం

ప్రారంభమైన ఇండిగో ఫ్లైట్ సర్వీసులు

విమాన సర్వీసును ప్రారంభించిన

కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి

ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న రాజమహేంద్రవరం నుంచి ఢిల్లీకి విమాన సర్వీసులు గురువారం ప్రారంభమయ్యాయి. మధురపూడిలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి రామ్మోహన్‌నాయుడు ఈ సర్వీసులను ప్రారంభించగా.. ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈనెల ఒకటిన ముంబైకి సర్వీసులు ప్రారంభమైన సంగతి తెలిసిందే.. - 6లో

నిరుపేదలకు..

ఆరోగ్య రక్ష



- ఆయుష్మాన్ భారత్ పేరుతో కేంద్ర ప్రభుత్వ పథకం
- ఒక్కో కుటుంబానికి రూ.5లక్షల వరకూ ఉచిత వైద్యం
- జిల్లాలో 6,44,333మందికి ఈకేవైసీ పూర్తి
- 4,51,872మందికి కార్డులు కూడా రాక..
- దారిద్ర్యరేఖకు ఎగువనున్న 70ఏళ్లు దాటిన వారంతా ఈ పథకానికి అర్హులే

పెద్దాపురం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ఆరోగ్య భరోసాను కల్పించే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా లబ్ధిదారులకు రూ.5లక్షల విలువ చేసే వైద్యాన్ని ఉచితంగా అందించనుంది. పథకానికి సంబంధించి గతంలోనే అర్హుల ఎంపిక ప్రక్రియను చేపట్టారు. మిగిలినవారికి కొద్దిరోజుల్లో ఇంటింటి సర్వేను నిర్వహించి ఎంపిక చేయనున్నారు. ఇప్పటివరకూ పూర్తి చేసిన ప్రక్రియ మేరకు జిల్లాలో ఆయుష్మాన్ భారత్ పథకానికి 3,27,338 అర్హత సాధించగా 9,75,365 మంది కుటుంబ సభ్యులున్నారు. వీరిలో 6,44,333మందికి కేవైసీ ప్రక్రియను స్థానిక సచివాలయ/వార్డు సిబ్బంది పూర్తిచేశారు. లబ్ధిదారులకు అందించేందుకు ఎన్టీఆర్ వైద్యసేవ కార్యాలయానికి 4,51,872 ఆయుష్మాన్ భారత్ కార్డులు రాగా, వీటిని జిల్లాలో అర్బన్ హెల్త్ సెంటర్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పంపిణీ చేశారు. అక్కడ సిబ్బంది 3,31,416మందికి కార్డులను అందించారు. మిగిలిన కార్డులను పంపిణీ చేయాల్సి ఉంది. కొద్దిరోజుల్లోనే ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని అధికారులు వెల్లడించారు.

రూ.5లక్షల వరకూ ఉచిత వైద్యం

ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ఉచితంగా రూ.5లక్షల వరకూ విలువ చేసే వైద్యాన్ని అందిస్తారు. జిల్లాలో ఆయుష్మాన్ భారత్ నెట్‌వర్క్ పరిధిలో ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రులు 78 వరకూ ఉన్నాయి. ఎన్టీఆర్ వైద్యసేవా నెట్‌వర్క్ పరిధిలో ఉన్న ఆస్పత్రులన్నీ ఈ పథకానికి సేవలందిస్తున్నాయి. ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ఇప్పటి వరకూ తొలి విడతలో 3,27,338 కుటుంబాలను అర్హులుగా గుర్తించారు.

ఇదీ ఎంపిక ప్రక్రియ

ఆయుష్మాన్ భారత్ పథకానికి బీపీఎల్ (దారిద్ర్యరేఖకు దిగువనున్న) కుటుంబానికి చెందిన వారంతా అర్హులే. ఇప్పటికే లబ్ధిదారుల జాబితాను కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాలకు అందించింది. వీరికి కార్డులను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. బీపీఎల్ పరిధిలో లేకపోయినా 70 ఏళ్లు దాటిన వారంతా ఈ పథకానికి అర్హులుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అర్హులు జాబితా వచ్చిన తర్వాత క్షేత్రస్థాయిలో ఏఎన్ఎం సర్వే చేస్తారు. యాప్‌లో వివరాలను పొందుపరుస్తారు. అనంతరం వారికి కార్డుల పంపిణీ చేస్తారు. ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయడం ద్వారా కార్డు డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు ఉంది. అర్హులైనప్పటికీ ఈ పథకానికి ఎంపిక కాకపోతే స్థానిక గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందిని సంప్రదించాలి.

కార్డుల పంపిణీకి చర్యలు

జిల్లాకు ఇప్పటివరకూ వచ్చిన ఆయుష్మాన్ భారత్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నాం. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ పరిధిలో ఉన్న అన్ని ఆస్పత్రుల్లో ఆయుష్మాన్ భారత్ పథకం కింద వైద్యసేవలు అంది స్తారు. ఇబ్బందులుంటే స్థానిక ఆరోగ్య సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకురావాలి. రాష్ట్రంలో ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో భాగంగా రూ.25లక్షల వరకూ ఉచిత వైద్యం పొందే వీలుంది.

-డాక్టర్ పి.రాధాకృష్ణ, ఎన్టీఆర్ వైద్యసేవ కోఆర్డినేటర్, కాకినాడ

ఉక్కుపాదం మోపాల్సిందే



- జిల్లాలోకి వచ్చే యానాం అక్రమ మద్యాన్ని అరికట్టాల్సిందే
- రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే చోట్ల సీసీ కెమెరాలతో పర్యవేక్షించండి
- శాంతిభద్రతల సమస్యలను సృష్టించాలనుకునే వారిని ఉపేక్షించొద్దు
- అమరావతిలో రెండోరోజు కలెక్టర్ల సదస్సులో కలెక్టర్, ఎస్పీకి సీఎం దిశానిర్దేశం
- బియ్యం అక్రమ రవాణా అక్రమార్కులపై పీడీ కేసులకు ఆదేశాలు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

జిల్లాలోకి పక్కనే ఉన్న యానాం నుంచి అక్రమంగా మద్యం భారీగా దిగుమతవుతోంది. పేరుకు చెక్‌పోస్టు ఉన్నా అక్రమంగా మందు అనేక ప్రాంతాల్లోకి వచ్చేస్తోంది. దీన్ని కచ్చితంగా అరికట్టి తీరాలి. ఇందుకోసం ఇకపై అక్రమ మద్యం రవాణా జరగకుండా నిఘా పెంచాలి. చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం చేయడంతోపాటు ఇతరత్రామార్గాల్లో మద్యం రవాణాఅయ్యే ప్రాంతాలను గుర్తించిఅరికట్టాలని ప్రభుత్వం ఆదేశించింది.

మద్యం, రేషన్ బియ్యంపై చర్చ

అమరావతిలో గురువారం రెండోరోజు కలెక్టర్ల సదస్సులో భాగంగా అక్రమ మద్యం అంశంపై చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో జిల్లా పక్కనే ఉన్న యానాంనుంచి అక్రమంగా మద్యం రవాణా పెరుగుతోన్న విషయంపై ప్రభుత్వం జిల్లా కలెక్టర్, ఎస్పీని అప్రమత్తం చేసింది. రేషన్‌బియ్యం కాకినాడ కేంద్రంగా విదేశాలకు ఎగిరిపోతున్న నేపథ్యంలో అక్రమ రేషన్ బియ్యంపై ఉక్కుపాదం మోపాలని సీఎం ఆదేశించారు. ఎక్కడికక్కడ తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. రేషన్ బియ్యంతో అక్రమంగా వ్యాపారం చేసే వారిపై పీడీ కేసులు నమోదు చేయడానికి వెనుకాడవద్దన్నారు. రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతుండడంపై ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. వీటి నివారణకు కలెక్టర్, ఎస్పీలు కలిసి కార్యాచరణ చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రధానంగా హైవేతోపాటు ఇతర ప్రాంతాల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. తద్వారా ప్రమాదాలకుగల కారణాలపై క్షుణ్ణంగా తెలుసుకుని ప్రమాదాలు జరగకుండా చూడాలని సూచించారు. ఆలయాలు, విగ్రహాలను తరచూ కూల్చుతుండడం, దేవుడి విగ్రహాలను అపవిత్రం చేస్తోన్న సంఘటనలు గతంలో జరిగిన నేపథ్యంలో వీటిద్వారా శాంతి భద్రతల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని సీఎం హెచ్చరించారు. దీంతో వీటివద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని సూచించారు.

ఉత్తీర్ణత శాతం పెరగాల్సిందే..

విద్యాశాఖ సమీక్షలో భాగంగా జిల్లాలో టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం మరింత పెరిగేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం కలెక్టర్‌కు సూచించింది. కాగా జిల్లాకు సంబంధించి న అనేక అంశాలపై ఆయాశాఖల వారీగా జరుగుతున్న పనులు, వాటి ప్రగతి, వెనుకబాటుపై ప్రభుత్వం తన నివేదికలో కలెక్టర్ల సదస్సులో పేర్కొంది. కొన్నింటిపై కలెక్టర్లు ప్రత్యేక పర్యవేక్షణ పెంచాలని ఆదేశించింది. శాఖలవారీగా ఇచ్చిన ప్రజంటేషన్‌లో భాగంగా జిల్లాలో పల్లె పండగ కింద 891 పనులు మంజూరవగా 847 మొదలయ్యాయని, వీటిలో 44పూర్తయ్యాయని వివరించింది. గోకులాలు 593 మంజూరవగా 538 మొదలవగా 11 పూర్తి అయినట్లు తెలిపింది. జలజీవన్ మిషన్ కింద జిల్లాలో 280 పనులను రూ.167కోట్లతో చేపట్టినట్లు పేర్కొంది. ప్రింటింగ్ క్లస్టర్ కింద కాకినాడలో రూ.14.76కోట్లతో ఏర్పాటవుతున్న ప్రాజెక్టుపై కలెక్టర్ పర్యవేక్షణ పెంచి వేగంగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించింది. చేనేతశాఖ సమీక్షలో భాగంగా ఉప్పాడలో కాటన్ శారీస్‌ను మరింత అభివృద్ధి చేసే విధంగా ఓ సొసైటీతో కలిసి పనిచేయడానికి ఆద్యం బిర్లా గ్రూప్ ముందుకు వచ్చిందని తెలిపింది. ఇది కాకుండా పిఠాపురంలో రూ.11.50కోట్లతో వస్తోన్న చేనేత క్లస్టర్లు సమర్థవంతంగా పనిచేసేలా కలెక్టర్ మానిటర్ చేయాలని ప్రభుత్వం సూచించింది. ఉప్పాడ, ప్రత్తిపాడులో పీహెచ్‌డబ్ల్యూసీఎస్ పథకం కింద చేనేత కోపరేటివ్ సొసైటీలు ఏర్పాటవుతున్నాయని వివరించింది. పెద్దాపురంలో రూ.55లక్షలతో వస్తోన్న క్లస్టర్‌తో చేనేత కార్మికులకు తోడ్పాటు లభించబోతోందని తెలిపింది. ముద్రాలోన్లపై సమీక్షలో భాగంగా జిల్లాలో ఐదు శాతమే పురోగతి ఉండడాన్ని ప్రభుత్వం గుర్తించింది. 333మందికిగాను కనీసం వంద మందికి కూడా రుణాలు అందలేదని పేర్కొంది.



అమరావతిలో రెండోరోజు సదస్సులో ఎస్పీ విక్రాంత్, కలెక్టర్ షాన్‌మోహన్

ఎయిర్‌పోర్టు నిర్మాణంపై అధ్యయనం

అటు తుని-అన్నవరం మధ్య ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఫీజిబిలిటీ అధ్యయనం కోసం అడుగులు పడ్డాయని ప్రభుత్వం పేర్కొంది. జిల్లాలో 28,637 వీధి దీపాలకుగాను 27,062 పనిచేస్తున్నాయని మిగిలినవి కూడా పనిచేసేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించింది. సంక్రాంతి నాటికి గుంతలు లేని రహదారుల కార్యక్రమం కింద జిల్లాలో 1,276 రహదారులకుగాను 43పూర్తయ్యాని, మిగిలిన పనులను వేగవంతం చేయాలని ఆదేశించింది. జిల్లాలో వచ్చే ఏడాది జనవరి 1 నుంచి మార్చి 31లోగా 4,461 ఇళ్లను పూర్తిచేయాలని లక్ష్యం విధించింది. పర్యాటకశాఖ సమీక్షలో అన్నవరంలో ప్రసాద్‌స్కీం కింద రూ.25.32కోట్లతో క్యూకాంప్లెక్స్ వ్రతమండపం, అన్నదానం కాంప్లెక్స్ పనులు ప్రతిపాదించామని, జనవరి 25కి టెండర్లు పూర్తవుతాయని ప్రభుత్వం పేర్కొంది.

గొయ్యో.. మొర్రో!!



రౌతులపూడి గ్రామశివారు రాళ్లకట్టు సమీపంలో గోతుల్లో దిగబడిపోయిన బస్సును తోస్తున్న విద్యార్థులు

రౌతులపూడి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ముందుచూస్తే నుయ్యి.. వెనుక చూస్తే గొయ్యి.. అంటారు కదా.. అలా ఉంది.. ఇక్కడ పరిస్థితి.. జిల్లాలోని రౌతులపూడి గ్రామశివారు రాళ్లకట్టు సమీపంలో రహదారి మధ్యలో పెద్దగొయ్యి వాహనదారులకు సంకటంగా మారింది. భారీ వాహనాలు తిరగడం, ఏలేరు కాలువలో వృథా నీరు గోతిలోకి చేరడంతో అది మరింత పెద్దదిగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం ఉదయం ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు నీటిలో దిగబడిపోవడంతో విద్యార్థులు తోయాల్సిన పరిస్థితి ఏర్పడింది. 40 నుంచి 50 టన్నులు భారీ బండరాళ్లను తరలించే లారీలవల్లే రహదారి నాశనమవుతోందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గొయ్యిని పూడ్చాలని వారు కోరుతున్నారు.

రెవెన్యూ సదస్సుల ప్రత్యేకాధికారులు వీరే

సామర్లకోట,డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం భూవివాదాల సమస్యల పరిష్కారానికి, భూబాధితులకు న్యాయం అందించేందుకు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల సంపూర్ణ లక్ష్యం నెరవేరేందుకు నియోజకవర్గ స్థాయి ప్రత్యేకాధికారులను నియమిస్తూ కలెక్టర్ షాన్ మోహన్ ఉత్తర్వులు జారీచేశారు. సామర్లకోట, కాకినాడ రూరల్, కాకినాడ అర్బన్ మండలాలకు కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబును నియమించారు. పెద్దాపురం, జగ్గంపేట, గండేపల్లి మండలాలకు పెద్దాపురం ఆర్డీవో కె.శ్రీరమణి, తుని, తొండంగి, కోటనందూరు మండలాలకు సెజ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కేవీ రామలక్ష్మి, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, కిర్లంపూడి మండలాలకు బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు, శంఖవరం, రౌతులపూడి మండలాలకు కాకినాడ డీపీఎం డి.వెంకటేశ్వరరావు, పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలాలకు హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ, కరప, పెదపూడి మండలాలకు సమగ్ర శిక్ష ఏపీసీ పి.వేణుగోపాలరావు, కాజులూరు, తాళ్లరేవు మండలాలకు ఎండోమెంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.భారతిలను నియమించారు. మండల ప్రత్యేక అధికారులుగా 21మంది జిల్లాస్థాయి ఉన్నతాధికారులను నియమిస్తూ కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో తెలిపారు.

మాస్టర్ ప్లాన్ పనులు వేగవంతం: కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కౌడ) మాస్టర్ ప్లాన్ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రభుత్వం ఆమోదం కోసం పంపించాలని ఆ విషయంపై కౌడ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఏపీవో కృష్ణారావు ఇతర సిబ్బందితో వైస్ ఛైర్మన్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భావన మాస్టర్ ప్లాన్ ప్రక్రియపై రివ్యూ చేసి సత్వరమే ప్రభుత్వ ఆమోదానికి ప్రతిపాదనలు తయారు చేసి పంపడానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

15న పొట్టిశ్రీరాములు వర్ధంతిని ఆత్మార్పణ దినంగా పాటించాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ),డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి జిల్లా, మండల, గ్రామ, నియోజకవర్గాల స్థాయిలో ఈనెల 15న అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతిని ఆత్మార్పణ దినంగా పాటించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. ఇందులోభాగంగా అన్ని కార్యాలయాల్లో అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు అలంకరించి ఆయన నిరుపమాన త్యాగనిరతికి కృతజ్ఞతాపూర్వకంగా వినమ్ర నివాళులర్పించాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని సూచించారు. జిల్లా బీసీ సంక్షేమం, సాధికరత అధికారి, డీఈవో, ఇంటర్మీడియట్ విద్యాధికారి, కళాశాల విద్య ప్రాంతీయ సంచాలకులు, జడ్పీ సీఈవో, మున్సిపల్ కమిషనర్లు ఈ కార్యక్రమాలను నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

దివ్యాంగురాలిపై ఫీల్డ్‌అసిస్టెంట్ అత్యాచారయత్నం 7

గౌరవం లేదు.. వేతనమూ లేదు..

- గౌరవ వేతనాల కోసం ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీల ఎదురుచూపు

సామర్లకోట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో ఆర్థిక విధ్వంసం జరిగింది. ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయులకు సమయానికి వేతనం అందని పరిస్థితి నెలకొంది. నెలాఖరులో జీతాలు ఇచ్చిన సందర్భాలు కోకొల్లలు. వేతన వెతలు ప్రజాప్రతినిధులకూ తప్పలేదు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీలకు కూడా గౌరవ వేతనం 6నెలల నుంచీ 15నెలలుగా అందలేదు. ఉమ్మడి జిల్లాలో 62మండలాలు ఉన్నాయి. వాటిలో రెండు మండలాలు ఖాళీ కాగా ఒకరు జడ్పీ ఛైర్మన్‌గా వ్యవహరించడంతో 59మండలాలు ఉన్నాయి. మండలానికి ఒక్కొక్కరు చొప్పున 59మంది జడ్పీటీసీలు ఉన్నారు. జడ్పీటీసీ, ఎంపీపీలకు నెలకు గౌరవవేతనంగా రూ.8వేలు. ఎంపీటీసీలకు రూ.3వేల చొప్పున అందాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీ, మండల పరిషత్‌ల అభివృద్ధిని అటకెక్కించింది. కేంద్రం ఇచ్చిన నిధులను సైతం పక్కదారి మళ్లించింది. దీంతో ఎంపీపీలు, ఎంపీటీసీలకు అందాల్సిన గౌరవవేతనం కూడా నిలిచిపోయిందని వారు వాపోతున్నారు.

ఆశలపై నీళ్లు

అప్పట్లో టీడీపీ పరిషత్ ఎన్నికలను బహిష్కరించడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 90శాతం మందికి పైగా స్థానికసంస్థల ప్రజాప్రతినిధులుగా వైసీపీ వారే ఎన్నికయ్యారు. అధికారపార్టీ ప్రజాప్రతినిధులమనీ, నిధులు దండిగా వస్తాయనీ, మండలాలు, గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసుకోవచ్చని ఆనందపడ్డారు. వారి ఆశలపై అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు చల్లింది. ఒక్క రూపాయి నిధులు కూడా విదల్చలేదు. పైగా కేంద్ర ఇచ్చిన 15వ ఆర్థిక సంఘం ఇతరత్రా నిధులను సైతం దారి మళ్లించింది. దీంతో ఎంపీపీలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు కన్న కలలన్నీ కల్లలయ్యాయి.

ఆఫీసులకు రాం.. రాం..

రాష్ట్రంలో పాలకపక్షం మారడంతో చాలా మండలాల్లో ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు ప్రభుత్వ కార్యాలయాలకు రావడమే తగ్గించేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పల్లెల్లో పల్లె పండుగ, జాతీయ ఉపాధి హామీ పథకం వంటి అభివృద్ధి పనులు సాగుతున్నాయి. ఇప్పుడైనా గౌరవ వేతనం అందుతుందా అని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఆశగా ఎదురుచూస్తున్నట్లు తెలుస్తోంది. ఉదాహరణకు సామర్లకోట మండలంలో ఎంపీటీసీకి నెలకు రూ.3వేల చొప్పున రూ.18వేలు చెల్లించాల్సిఉంది.ఒక్క సామర్లకోట మండలంలోనే 20మంది ఎంపీటీసీలుగాను 19 ఎంపీటీసీలకు రూ.18వేల చొప్పున రూ.3.42లక్షల చొప్పున ఎంపీడీవో కార్యాలయం ద్వారా చెల్లించాలి. గౌరవవేతనానికి సంబంధించి ప్రభుత్వం ఈ ఏడాదిలో ఫిబ్రవరి వరకూ మాత్రమే వేతనం మంజూరు చేసింది. జిల్లావ్యాప్తంగా జడ్పీటీసీలకు 8నెలల బకాయిలుగా రూ.8.37లక్షల నిధుల కేటాయింపులకు నివేదించినట్లు జడ్పీ కార్యాలయ వర్గాల ద్వారా తెలిసింది.



విద్యుత్ కాంతులతో ధగధగలాడుతున్న కాకినాడ జగన్నాథపురంలోని సెయింట్ థామస్ చర్చి

వందేళ్ల నాటి.. పురాతన చర్చిలు

క్రిస్మస్ సీజన్ మొదలైంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చర్చిలు విద్యుదీకరణతో ధగధగలాడుతున్నాయి. కాకినాడ, రాజమహేంద్రవరం నగరాలతోపాటు ఇతర ప్రాంతాల్లోను క్రైస్తవ దేవాలయాలు ప్రత్యేక శోభను సంతరించుకుంటున్నాయి. డిసెంబరు నెల క్రైస్తవులకు ఎంతో ప్రత్యేకమైనది. అన్ని చర్చిల్లో క్రిస్మస్ సంబరాలు నిర్వహిస్తుంటారు. ఈ వేడుకలు ప్రారంభం కావడంతో చర్చిల వద్ద సందడి కనిపిస్తోంది. ఈ నెలంతా క్రైస్తవులు క్రిస్మస్ సంబరాల్లో భాగంగా ప్రత్యేక ప్రార్థనల్లో గడుపుతారు. ఈ నేపథ్యంలో కాకినాడలోని వందల ఏళ్లనాటి పురాతన చర్చిల విశేషాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- క్రైస్తవులకు ఆధ్యాత్మికంగా ప్రాధాన్యమైన డిసెంబరు నెల
- చర్చిల్లో క్రిస్మస్ సంబరాలు ప్రారంభం
- విద్యుదీకరణతో ఆకట్టుకుంటున్న చర్చిలు
- చారిత్రక నేపథ్యం కలిగిన ప్రార్థనా మందిరాలు

(ఆంధ్రజ్యోతి-కాకినాడ కార్పొరేషన్)

డచ్ దేశస్తుల సెయింట్ థామస్ చర్చి



ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న వందలాది చర్చిల్లో అతి పురాతన కాలం నాటివి కాకినాడలోనే ఉన్నాయి. 1780లో వ్యాపారం నిమిత్తం భారతదేశం వచ్చిన డచ్ దేశస్తులు కాకినాడ జగన్నాథపురంలో సెయింట్ థామస్ చర్చిని నిర్మించినట్లు చెప్తారు. పదెకరాల స్థలంలో చుట్టూ ప్రహారీ, ఒక ఎకరం స్థలంలో మందిరాన్ని నిర్మించారు. డచ్ వారి అనంతరం పోర్చుగీస్ వారు ఈ చర్చి బాధ్యతలను చూశారు. తర్వాత కాలంలో బ్రిటీష్ యాజమాన్యం మందిర నిర్వహణ చేపట్టింది. 1947, సెప్టెంబరు 17 నాటికి భారతీయ క్రైస్తవుల చేతుల్లోకి వచ్చింది. అప్పటినుంచి ఈ మందిరానికి సెయింట్ థామస్ పేరుకు అదనంగా చర్చి ఆఫ్ సౌత్ ఇండియా (సీఎస్ఐ) అనే పేరు వచ్చి చేరింది. దీని పరిధిలో కేరళ, కర్నాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌తోపాటు శ్రీలంక కూడా ఉంది. 1974 వరకు ఈ ఆలయంలో ఆంగ్లంలోనే ఆరాధన జరిగేది. 1975 నుంచి తెలుగులో కూడా ఆరాధన ప్రారంభించారు.

ఆర్‌సీఎం చర్చి: 1886


కాకినాడ జగన్నాథపురంలో మరో ప్రాచీన చర్చి ఉంది. దీన్ని కూడా ఆంగ్లేయుల కాలంలోనే 1886లో నిర్మించారు. సెయింట్ ఆర్సీ రోమన్ కేథలిక్ మిషన్(ఆర్సీఎం) చర్చిగా పిలుస్తారు. దీంట్లో ఏసుక్రీస్తుకు జన్మనిచ్చిన మేరీమాత విగ్రహం ప్రాచుర్యాన్ని పొందింది. కష్టాల్లో ఉన్నప్పుడు ముందుగా ఆలయ ప్రాంగణంలో ఉన్న మేరీమాతను దర్శించుకుని కొవ్వొత్తులు వెలిగించి తమ బాధలను ప్రార్థనల రూపంలో చెప్పుకుంటే మన శ్శాంతి కలుగుతుందని క్రైస్తవుల నమ్మకం.



కాకినాడ జగన్నాథపురంలోని ఆర్‌ఎంసీ చర్చి

118ఏళ్ల నాటి బాప్టిస్ట్ చర్చి

కాకినాడ జగన్నాథపురంలోనే 1906లో నిర్మించిన బాప్టిస్టు చర్చి ఉంది. 118ఏళ్ల క్రితం అప్పటి ఆంగ్లేయులు నిర్మించారు. దీన్ని కాకుండా నగరంలోని రాజారామ్మోహనరావు రోడ్డులోని గ్రేట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి, ఎల్విన్‌పేటలోని బాప్టిస్ట్ చర్చి, రామారావుపేటలోని లూథరన్ చర్చిలను పురాతన కాలంలో నిర్మించారు. క్రిస్మస్ నెల ప్రారంభం కావడంతో అన్ని చర్చిలు లైటింగ్‌తో కళకళలాడుతున్నాయి.



విద్యుత్ వెలుగులతో కళకళలాడుతున్న కాకినాడ జగన్నాథపురంలోని బాప్టిస్ట్ చర్చి

‘పిఠాపురంలో అలా మొదలైంది’ చిత్రీకరణకు శ్రీకారం

- నటకిరీటి రాజేంద్రప్రసాద్‌పై సినిమా ముహూర్తపు సన్నివేశం షూటింగ్

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గం సినిమా షూటింగ్‌లకు వేదికగా మారుతోంది. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు సీతారామస్వామి దేవస్థానం(రామాలయం)లో ‘పిఠాపురంలో అలా మొదలైంది’ సినిమా చిత్రీకరణ ప్రారంభమైంది. ప్రముఖ దర్శకుడు మహేష్‌చంద్ర దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా ముహూర్తపు సన్నివేశాలను నటకిరీటి రాజేంద్రప్రసాద్‌పై జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు మహేష్ చంద్ర మాట్లాడుతూ గోదావరి జిల్లా ప్రాంతానికి చెందిన తాను ఎన్నో విజయవంతమైన సినిమాలకు దర్శకత్వం వహించానన్నారు. సరికొత్త ప్రేమకథా అంశంతో చిత్రాన్ని నిర్మించబోతున్నామని, ఇదే ప్రాంతంలో నెలరోజులపాటు చిత్ర నిర్మాణం జరుగుతుందని వివరించారు. జిల్లాలో ఉన్న నటీనటులకు, ఔత్సాహికులకు ఈ సినిమాలో నటించే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ చిత్రంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్‌తోపాటు థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీరాజ్, సీనియర్ నటి జె.వాహిని, నటుడు కేదార్‌శంకర్, జబర్దస్త్ ఆర్టిస్ట్ కేవీ పాల్, బీఎన్ రాజు తదితర నూతన నటీనటులతో ఈ చిత్రాన్ని చిత్రీకరిస్తున్నామన్నారు. ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ తీన్‌మార్ మల్లన్న మాట్లాడుతూ చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అనంతరం రామాలయ ఆవరణలో పెళ్లి సన్నివేశాలను చిత్రీకరించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, ఓదూరి నాగేశ్వరరావు, కిషోర్, పిఠాపురం సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.



ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొడుతున్న పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి



అన్నవరం నూతన ఈవోగా

సుబ్బారావు

రేపు బాధ్యతల స్వీకారం

అన్నవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం ఈవోగా వీర్ల సుబ్బారావు బాధ్యతల స్వీకరణకు దేవదాయ శాఖ ఇన్‌చార్జి ముఖ్య కార్యదర్శి కమిషనర్ సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రెవెన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న సుబ్బారావును అన్నవరం ఈవోగా నియమిస్తూ గత నెల 29న ఉత్తర్వులిచ్చినా రిలీవ్ కాకపోవడంతో కొంత సందిగ్ధత నెలకొంది. సుబ్బారావును ఈవోగా ఏడాది పాటు డిప్యూటేషన్‌పై నియమిస్తూ కమిషనరు కార్యాలయం నుంచి ఆదేశాలొచ్చాయి. కొత్త ఈవోగా సుబ్బారావు శనివారం బాధ్యతలు స్వీకరిస్తారని దేవస్థానం అధికారులు వెల్లడించారు.

15న సత్యదేవుని మెట్లోత్సవం

అన్నవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ప్రారంభ సూచికగా ప్రతిఏటా సత్యదేవుని సన్నిధిలో నిర్వహించే మెట్లోత్సవాన్ని ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం స్వామి, అమ్మవార్ల గ్రామసేవ అనంతరం 9.30 గంటలకు తొలి మెట్టు వద్ద పండితులు ప్రత్యేక పూజలు జరుపుతారు. అనంతరం స్వామివారి ప్రధానాలయం వరకు ఉన్న ప్రతి మెట్టుకు మహిళలు పసుపు, కుంకుమ పూసి హారతులిచ్చి నైవేద్యాలు సమర్పిస్తారు. సుమారు 380 మెట్లకు ఈ పూజా కార్యక్రమాలు చేపడతారు. 15 నుంచి సంక్రాంతి వరకు స్వామి, అమ్మవార్లకు ప్రతినిత్యం వెండి పల్లకిలో గ్రామసేవ నిర్వహిస్తారు.





శ్రీరామ పాదుకల విశిష్టతను వివరిస్తున్న అహోబిల స్వామి. చిత్రంలో త్రిదండి చినజీయర్ స్వామి

వైభవంగా శ్రీరామ పాదుకా పట్టాభిషేకం

- త్రిదండి చినజీయర్ స్వామి, అహోబిల స్వామి రాక
- వేలాది మంది భక్తులతో కరసేవ
- ఆంధ్ర భద్రాద్రి క్షేత్రం పేరు తులా గిరిగా మార్పు

ప్రత్తిపాడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు గ్రామ పరిధిలోని నరేంద్రగిరి రామాలయ నిర్మాణ ప్రదేశం వద్ద శ్రీరామ పాదుకా పట్టాభిషేక మహోత్సవాన్ని త్రిదండి చినజీయర్ స్వామి గురువారం వైభవంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి తరలి వచ్చిన భక్తులతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. తొలుత త్రిదండి చినజీయర్ స్వామితో పాటు త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి వర్తక సంఘం అధ్యక్షుడు అనంతపల్లి శ్రీను నివాసానికి చేరుకుని అక్కడ తీర్థ గోష్ఠి నిర్వహించారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా, టీడీపీ నాయకుడు కొమ్ముల కన్నబాబు జీయర్ స్వామిని దర్శించుకున్నారు. ఎస్‌బీఐ వీధి నుంచి ఓపెన్ టాప్ జీపులో ఊరేగింపుగా బయల్దేరిన స్వామీజీలు వేలాది మంది భక్తులు, మంగళవాయిద్యాల మధ్య కర సేవ చేస్తుండగా నరేంద్రగిరికి చేరుకున్నారు. అక్కడ వారికి నిర్వాహకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం చినజీయర్ స్వామి మెట్ల మార్గాన్ని ప్రారంభించి భక్తులకు అనుగ్రహభాషణ చేశారు.

సమస్త దోషాలను తొలగించి సర్వ మానవాళికి శాంతి, శ్రేయస్సు ప్రసాదించేదే శ్రీరామ పాదుకా పట్టాభిషేకం అని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి అన్నారు. సమతామూర్తి శ్రీరాముడి పాదుకలను ఆశ్రయించి ఆరాధిస్తే సంపద, రాజ్యం పదింతలు అయ్యాయని ప్రవచించారు. అహల్య పాపాలను తొలగించడం, భరతుడి తాపాన్ని పోగొట్టి ధర్మకర్తగా నిలపడం, సుగ్రీవుడి భయాన్ని తీర్చి సుఖ సంపదలు ఇవ్వడం, శరణుకోరిన విభీషణుడిని రారాజు చేయడం, రుషులకు శాంతిని పెంచి పక్షికి మోక్షం ఇవ్వడం వంటివి శ్రీరాముడి మహిమలన్నారు. పాదుకా పట్టాభిషేకం ఆవశ్యకతను, శ్రీరామ చరిత్రను అహోబిల రామానుజ జీయర్ స్వామి, భరతుడు శ్రీరామ పాదుకలతో రాజ్యం పాలించిన విధానాన్ని నేపాల్ కృష్ణమాచార్యులు వివరించారు.

ఆంధ్ర భద్రాద్రి రామ క్షేత్రంగా ఉన్న పేరును చిన జీయర్ స్వామి మార్పు చేశారు. ప్రత్తిపాడులోని ప్రత్తి అనగా తులమని అర్థం కలిగి ఉందని, భద్రాద్రిలో భద్రుడి ప్రార్థనకు కరిగివచ్చిన రాముడు ప్రత్తిపాడు ప్రజల ప్రార్థనకు ఇక్కడ కొలువుదీరనున్నారు. అందుకే ఈ ప్రాంతానికి తులాగిరి శ్రీరామ క్షేత్రంగా నామకరణం చేస్తున్నట్టు భక్తుల కరతాళ ధ్వనుల మధ్య జీయర్ స్వామి ప్రకటించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రీరామ సేవక్ కమిటీ సభ్యులు అనంతపల్లి శ్రీను, గోగుల బుజ్జి, రెడ్నం రాజా, స్థానిక ప్రముఖుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, జడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, డీవీఎస్ రాజురమేష్, స్థల దాతలు చలంకూరి భాను కుటుంబ సభ్యులు పూజల్లో పాల్గొన్నారు.





ప్రత్తిపాడులో కర సేవకుల ప్రదర్శన, పాదుకా పట్టాభిషేక మహోత్సవాన్ని తిలకిస్తున్న మహిళలు



మధురపూడి విమానాశ్రయం వద్ద ఢిల్లీకి నూతన సర్వీసు ప్రారంభించి కేక్ కట్ చేస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు. చిత్రంలో ఎంపీలు పురందేశ్వరి, ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యేలు

రాజమహేంద్రవరం నుంచి నేరుగా ఢిల్లీకి విమానం

- ప్రారంభమైన ఇండిగో సర్వీసులు.. ఇన్నాళ్లకు చిరకాల వాంఛ నెరవేరింది..
- విమాన సర్వీసును ప్రారంభించిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి

కోరుకొండ, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నుంచి ఢిల్లీకి నూతనంగా విమాన సర్వీసు ప్రారంభించడం ద్వారా ఇన్నాళ్లకు ఇక్కడి ప్రజల చిరకాల వాంఛ నెరవేరిందని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. న్యూఢిల్లీ రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి నేరుగా గురువారం ఉదయం 9 గంటలకు 6ఈ364 ఇండిగో విమాన సర్వీసు మధురపూడి విమానాశ్రయానికి చేరుకుంది. నియమాలను అనుసరించి నీటిని వెదజల్లి నూతన విమాన సర్వీసుకు స్వాగతం పలికారు. ఈ తొలి విమాన సర్వీసులోనే ప్రయాణికులతో కలిసి న్యూఢిల్లీ నుంచి రాజమహేంద్రవరం చేరుకున్న కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఢిల్లీ నుంచి బయల్దేరి వచ్చిన ఈ తొలి విమాన సర్వీసుకు మధురపూడి విమానాశ్రయం వద్ద రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి, కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయశ్రీనివాస్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, జ్యోతుల నెహ్రూ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మద్దిపాటి వెంకట్రాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ ఎస్.చినరాముడు, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వర్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రాజమండ్రి విమానాశ్రయం వద్ద కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి రాజమండ్రి నుంచి న్యూఢిల్లీకి వెళ్లే నూతన విమాన సర్వీసును ఉదయం 9.45 గంటలకు ప్రారంభించారు.

ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ రాజమహేంద్రవరం విమానాశ్రయం అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ మొట్టమొదటి అడుగుగా రాజమండ్రి నుంచి దేశ రాజధాని ఢిల్లీకి నూతన ఎయిర్‌బస్ కల్పించిన ఘనత ప్రధాని నరేంద్రమోదీదేనన్నారు. త్వరలో గోదావరి పుష్కరాలు రానున్న నేపథ్యంలో రాజమహేంద్రవరానికి యావత్తు భారతదేశానికి విమాన సర్వీసులు అవసరమయ్యే ఆవశ్యకత ఉందన్నారు. అలాగే రాజమహేంద్రవరం నుంచి తిరుపతి, వారాణసి, షిరిడి వంటి నగరాలకు విమాన సర్వీసులు నడిపేలా కేంద్రమంత్రి కృషిచేయాలని కోరారు. అనంతరం ప్రయాణికులతో మధురపూడి విమానాశ్రయం నుంచి బయల్దేరిన ఇండిగో నూతన విమాన సర్వీసు మధ్యాహ్నం 12 గంటలకు న్యూఢిల్లీకి వెళ్లింది. కాగా ఈనెల 1న వాణిజ్య రాజధాని ముంబైకి విమాన సర్వీసు ప్రారంభమైన సంగతి తెలిసిందే. ముంబై, ఢిల్లీ విమాన సర్వీసుల కోసం ఎంతోకాలంగా ఎదురుచూసిన ఉభయగోదావరి జిల్లావాసుల కల ఇన్నాళ్లకు నెరవేరింది.



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం రూ.1.38 కోట్లు

- బంగారం 31 గ్రాములు, వెండి 990 గ్రాములు, పలు దేశాల కరెన్సీ లభ్యం

ఆత్రేయపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని హుండీలను పర్యవేక్షణాధికారులు వి.సత్యనారాయణ, టి.ప్రసాద్ సమక్షంలో గురువారం తెరిచి వసంత మండపంలో లెక్కించారు. 37 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.92,16,755, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.42,47,958... మొత్తం రూ.1,38,49,477 ఆదాయం లభించింది. బంగారం 31 గ్రాములు, వెండి 990 గ్రాములు, పలు దేశాల విదేశీ కరెన్సీ వచ్చాయని ఆలయ ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. క్షేత్రపాలకుడు విశ్వేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.3,84,744 లభించింది. లెక్కింపులో గ్రామస్తులు, అర్చకులు, ఆలయ సిబ్బంది, బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.



వ్యానులో తరలిస్తుండగా పట్టుకున్న ఫర్నిచర్

అంతా టేకుమయం

- అటవీ శాఖ అధికారిణి తరలించిన ఫర్నిచర్ వివరాలు వెల్లడించిన కూనవరం రేంజర్

ఎటపాక, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం అటవీ శాఖలో రేంజర్‌గా పనిచేసి ఇటీవల బదిలీ వెళ్లిన అధికారిణి తాలూకా టేకు ఫర్నిచర్‌ను బుధవారం రాత్రి ఐషర్ వ్యాన్‌లో తరలిస్తుండగా నందిగామ వద్ద గ్రామస్తులు అడ్డగించి పట్టుకున్న సంగతి తెలిసిందే. వెంటనే ఆ ఫర్నిచర్‌ను, వ్యాన్‌ను అటవీ శాఖ సిబ్బంది పురుషోత్తపట్నంలోని అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. గురువారం ఉదయం కూనవరం రేంజర్ కరుణాకర్ సమక్షంలో లారీలోని టేకు ఫర్నిచర్‌ను బయటకు తీసి విచారించారు. అందులో పాత (పాలిష్ వేసిన) టేకు టేబుల్, డైనింగ్ టేబుల్, డ్రెస్సింగ్ టేబుల్, దివాన్‌కాట్, టేకు కుర్చీలు, టేకు మంచాలు, నాన్ టేకు దిమ్మ లభ్యమైనట్టు రేంజర్ కరుణాకర్ తెలిపారు. ఎటువంటి పత్రాలు లేకుండానే వాటిని రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. వ్యాన్‌ని స్వాధీనం చేసుకున్నారు. వీటికి సంబంధించిన పత్రాలు చూపించాలని బదిలీ అయిన అటవీ శాఖ అధికారిణి విజయలక్ష్మిని అడగ్గా పత్రాలు తీసుకొస్తానని చెప్పిందని కరుణాకర్ చెప్పారు. విచారణ అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

డివైడర్‌ని ఢీకొని వ్యక్తి మృతి

శంఖవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కత్తిపూడి వద్ద 16వ జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. అన్నవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... జెడ్.రాగంపేట గ్రామానికి చెందిన శ్రీమంతుల వీర వెంకటరమణ (37) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం స్నేహితుడు పల్సర్ బైక్ తీసుకుని సొంత పనిమీద తుని బయల్దేరాడు. కత్తిపూడి శివారు సీతంపేట బంకు సమీపంలో డివైడర్‌ని బలంగా ఢీకొట్టడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య సుబ్బలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీహరిబాబు తెలిపారు.


బాలబాలాజీ హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న సిబ్బంది

బాలబాలాజీ హుండీ ఆదాయం రూ.13,35,485

మామిడికుదురు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ హుండీ ఆదాయం రూ.33,35,485 వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. 42 రోజులకుగాను హుండీల లెక్కింపును గురువారం నిర్వహించారు. లెక్కింపు కార్యక్రమానికి అమలాపురం తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు పర్యవేక్షణాధికారిగా హాజరయ్యారు. ఈ ఆదాయంతోపాటు 0.2 గ్రాముల బంగారం, 0.120 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చిందన్నారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, గ్రామస్తులు, అర్చకులు, స్వామివారి సేవకులు, బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



15 నుంచి కోట సత్తెమ్మ తల్లి తిరునాళ్లు

నిడదవోలు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మతల్లి దేవస్థానంలో ఈనెల 15 నుంచి 19 వరకు తిరునాళ్ల మహోత్సవాలు నిర్వహించనున్నామని సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. 15న ఫౌండర్ ఫ్యామిలీమెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ దంపతులు కలశస్థాపనతో ఉత్సవాలను ప్రారంభించి అమ్మవారికి లక్ష కుంకుమార్చన విశేష పూజలు నిర్వహించనున్నారు. 16న గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం, నిడదవోలు నాంగల్యదేవి దేస్థానం వారితో సారె సమర్పణ, 17న నిడదవోలు ఆర్యవైశ్య సంఘం సారె సమర్పణ, 18న రాజమహేంద్రవరం నుంచి 101 మంది మహిళలతో సారె, పసుపు కుంకుమ సమర్పణ, 19న తిరునాళ్ల ముగింపోత్సవం జరుగుతాయని సహాయ కమిషనర్ తెలిపారు.

నాన్న గద్దర్ ఇచ్చిన స్ఫూర్తి..ప్రజలే నాకు ఆదర్శం

గద్దర్ జాతీయ సేవా అవార్డుల పంపిణీలో వెన్నెల గద్దర్


పి.గన్నవరంలో గద్దర్ జాతీయ సేవా పురస్కార అవార్డులను ప్రధానం చేస్తున్న వెన్నెల గద్దర్, ఎమ్మెల్యే సత్యనారాయణ

పి.గన్నవరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): నాన్న గద్దర్ లేకపోయినప్పటికీ ఆయన ఇచ్చిన స్ఫూర్తి, ప్రజలను ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళుతున్నానని తెలంగాణ రాష్ట్ర సంస్కృతిక సారధి చైర్మన్ డాక్టర్ వెన్నెల గద్దర్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా పి.గన్నవరం సాయితేజ జూనియర్ కళాశాలలో జరిగిన గద్దర్ జాతీయ సేవా పురస్కారాలు పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అధ్యక్షత వహించగా ఆమె పాల్గొని మాట్లాడారు. నాన్న ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడానికి అవకాశం కల్పించిన జాతీయ కాంగ్రెస్ అధినాయకులకు, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధినాయకులకు పేరుపేరున వందనాలు తెలుపుతున్నట్లు ఆమె తెలిపారు. ఎమ్మెల్యేగా ఓటమి పొందిన సమయంలో నారాజ్యం, నారాజు గెలిచాడని చాటిచెప్పినట్లు ఆమె వివరించారు. అనంతరం నాప్రభుత్వం రాష్ట్ర సంస్కృతిక సారధి చైర్మన్‌గా అవకాశం కల్పించి నాపాట, ఆటతో, మాటతో, నాటకాలతో పల్లె పల్లెకు తిరిగి ప్రజలను చైతన్యవంతం చేసే అవకాశం మా ప్రభుత్వం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. మనమందరం తెలుగు తల్లి పిల్లలు కావడంతో అదే గజ్జెల సవ్వడితో ఏపీలో కూడా ముందుకు వస్తున్నానని చెప్పారు. గద్దర్ ఆశయాలు ఏమిటంటే అందరూ బాగా చదువుకోవాలి-జ్ఞానం ఒక్కటే మిగులును, ఎక్కడైతే అణచివేత ఉంటుందో..అక్కడ తిరుగుబాటు ఉండాలన్నదే నాన్న ఆశయాలన్నారు.

అన్నలారా లెండిరా.....

నాకు జన్మనిచ్చిన తల్లివి, నాకుతోడబుట్టిన చెల్లివి, ఎన్నాళ్ల కన్నీళ్లు, నువ్వు బతుకులు మార్చే శక్తివి, హే హే అమ్మ నువ్వు మహాశక్తివి తల్లి అంటూ గద్దర్ వెన్నెల విప్లవ గీతాన్ని ఆలపించారు. అదేవిధంగా విద్యార్థులకు సామాజిక సందేశాన్నిచ్చే రెండు కథలను వివరించి వాటికి అర్థం చెప్పారు. రోజు ఒక కథ విని పడుకోండి అంటూ విద్యార్థులకు మదర్ థెరిస్సా జీవిత సేవలను వివరించారు. మదర్ థెరిస్సా తన 12వ ఏటలోనే జీవితలక్ష్యం ఎంచుకున్నారన్నారు. 69ఏళ్ల పాటు భారదేశంలో బడుగు బలహీన వర్గాల ప్రజలకు సేవలందించారన్నారు. సమాజంలో సేవలందించే వారిని గుర్తించి పురస్కారాలు అందించాలనే ఆలోచన రావడం మంచి పరిణామమని చెబుతూ అవార్డుల నిర్వహణలో పాల్గొన్న మమత స్వచ్ఛంద సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కోరుకొండ జాన్‌కు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజాసమస్యలను పాటరూపంలో వివరిస్తూ సమాజంలో మార్పుకోసం పోరాడిన మహోన్నత వ్యక్తి, శక్తి గద్దరన్న అని కొనియాడారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఎన్నో విప్లవ గీతాలను రచించి, ఆలపించారన్నారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాలవారు 110మందికి అవార్డులు అందించి సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, మాజీ జెడ్పీ ప్రతిపక్షనేత సాకా ప్రసన్నకుమార్, మనం ఫౌండేషన్ చైర్మన్ చక్రవర్తి, ముదునూరి లతేంద్రవర్మ, బల రామ్మూర్తి, దాసరి రత్నం, హనుమాన్,పెద్దకాపు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో లక్ష్యాలను చేధించాలి

- నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్
- అంతర్ కళాశాలల విలు విద్య పోటీలు


బాణం వేసి విలువిద్యపోటీలను ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ సుధాకర్

దివాన్‌చెరువు, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): ఏకలవ్యుని మాదిరిగా ఏకాగ్రతతో లక్ష్యాలను చేధించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, క్రీడాబోర్డు ఇన్‌చార్జి కార్యదర్శి ఆచార్య జి.సుధాకర్ అన్నారు. నన్నయ వర్శిటీ విద్య కళాశాల ఆధ్వర్యంలో అంతర్ కళాశాలల విలువిద్య పోటీలు, విశ్వవిద్యాలయ జట్టు ఎంపికలను గురువారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుధాకర్ గురివైపు బాణం సంధించి పోటీలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విలువిద్యను ప్రోత్సహించడంలో నన్నయ విశ్వవిద్యాలయం వ్యాయామవిద్య విభాగం చేస్తున్న కృషిని అభినందించారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని నన్నయ అనుబంధ కళాశాలల నుంచి పురుష, మహిళ అభ్యర్థులు 40 మంది హాజరయ్యారు. ఇండియన్ రౌండ్ ఆర్చరీ విధానంలో పోటీలు నిర్వహించారు. ప్రతిభావంతులైన నలుగురు పురుషులను, నలుగురు మహిళలను విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక చేశారు. వీరిలో పురుషుల్లో టి.అజయ్(ఎస్‌కేవీటీ కళాశాల, రాజమహేంద్రవరం), పి.కృష్ణ(సీబీఆర్ కళాశాల, పిఠాపురం) యు.మహేష్‌బాబు, వి.వెంకటప్రసాద్(ప్రభుత్వడిగ్రీ కళాశాల, చింతలపూడి) ఎంపికయ్యారు. మహిళల్లో డి.మానస, జి.నవ్యమమత(ఏఎస్‌డీ కళాశాల, కాకినాడ), జి.సావిత్రి, సీహెచ్ అంజలి(ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతలపూడి)లు ఎంపికయ్యారు. వీరు ఈనెల 22నుంచి 26వరకూ భువనేశ్వర్‌లోని కిట్ విశ్వవిద్యాలయంలో జరిగే అఖిల భారత విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక చైర్మన్ కె.సుబ్బారావు, కార్యదర్శి వి.సాల్మన్‌దేవానంద్, పరిశీలకుడు సీవీ సుబ్రహ్మణ్యం, ఎంపిక కమిటీ సభ్యులు ఆలీ, విజయ్‌కుమార్, వ్యాయామ విద్య అధ్యాపకులు ఆర్.సాంబశివరావు, బి.రామ్‌గోపాల్, బాలసత్యనారాయణ, విశ్రాంత ఎంఈవో గోపాలకృష్ణ, టి.లక్ష్మణ్, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీ పోటీలకు పిఠాపురం విద్యార్థి ఎంపిక


పిఠాపురం విద్యార్థి కృష్ణతో కోచ్ లక్ష్మణరావు

పిఠాపురం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు పిఠాపురం విద్యార్థి ఎంపికయ్యారు. రాజమహేంద్రవరంలోని నన్నయ్య యూనివర్సిటీలో జరిగిన ఇంటర్ కాలేజీ ఆర్చరీ పోటీల్లో పిఠాపురం పట్టణంలోని సీబీఆర్ డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్స్ సెకండియర్ చదువుతున్న పి.కృష్ణ ఇండియన్ రౌండ్ వ్యక్తిగత ఆర్చరీ ఈవెంట్‌లో రజత పతకం సాధించాడు. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా ఒడిసా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరుగుతున్న ఆల్‌ఇండియా యూనివర్సిటీస్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కృష్ణ ను, అతనికి శిక్షణ ఇచ్చిన కోచ్ లక్ష్మణరావులను పలువురు అభినందించారు.

పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ పేరుతో ఫేక్ కాల్స్

- ట్రేడ్ డబ్బులు ఫోన్ పే చేయాలని దుకాణదారులకు ఫోన్
- పోలీసులకు ఫిర్యాదుచేసిన కమిషనర్

పెద్దాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ పేరుతో ఓగుర్తు తెలియని వ్యక్తి నుంచి పట్టణంలో పలువురు దుకాణదారులకు ఫోన్‌కాల్స్ వచ్చాయి. మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని లేకపోతే ఇబ్బందులు తప్పవని సదరు వ్యక్తి దుకాణదారులకు కాల్స్ చేసి నేనుచెప్పిన నంబర్‌కు నగదును ఫోన్‌పే చేయాలని లేకపోతే షాప్ సీజ్ చేస్తామని చెప్పడంతో పలువురు కంగారుపడ్డారు. గతేడాది ట్రేడ్‌కు సంబంధించి ట్యాక్స్‌లు చెల్లించినా మళ్లీ ఎందుకు అడుగుతున్నారని అనుమానం వచ్చి పలువురు దుకాణదారులు ఆందోళనకు గురయ్యారు. ఫేక్ ఫోన్ కాల్ చేసిన వ్యక్తి నెం.7569778380 నుంచి కాల్స్‌చేసి డబ్బులు అడిగినట్లు తెలియడంతో పలువురు ఈవిషయాన్ని ఆంధ్రజ్యోతి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతిని ఆరా తీయడంతో ఈవిషయం తన దృష్టికి వచ్చిందని తాను ఎవరికీ ఫోన్ చేయలేదన్నారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈవిషయంపై ఎస్ఐ మౌనికను వివరణ కోరగా ఈవిషయం తమ దృష్టికి వచ్చిందని, వ్యాపారులను ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. డబ్బులు ఎవరూ చెల్లించి మోసపోవద్దని ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు.

జాతీయస్థాయి వర్క్‌షాపునకు మంగారాణి ఎంపిక


ఎంపిక పత్రాన్ని మంగారాణికి అందిస్తున్న డీఈవో వాసుదేవరావు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో నిర్వహించే జాతీయ వర్క్‌షాపునకు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ నాగరాజా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మోటూరి మంగారాణి ఎంపికయ్యారు. ఈ మేరకు ఎంపికైన పత్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి వాసుదేవరావు అందించారు. నేషనల్ సెంటర్‌ఫర్ స్కూల్ లీడర్‌షిప్(ఎన్‌సీఎస్‌ఎల్ న్యూపా)వారు ఢిల్లీలో నిర్వహించనున్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించేందుకు పెడగోగికల్ లీడర్‌షిప్ అనే అంశంపై నిర్వహించే కంటెంట్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్‌లో మంగారాణి పాల్గొంటారు. ఈ వర్క్‌షాపులో పాల్గొనే అవకాశం ఆంధ్రప్రదేశ్ నుంచి మంగారాణి ఒక్కరికే రావడంతో జిల్లా విద్యాశాఖ హర్షం వ్యక్తం చేసింది. ఈ వర్క్‌షాపు ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు ఢిల్లీలోని ఎన్ఎస్‌సీఎల్‌లో జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మంగారాణిని అర్బన్ డీఐ బి.దిలీప్ కుమార్, అర్బన్ ఎంఈవో-2 రమారజనీ అభినందించారు.

జాడలేని పులి

ధారపల్లి జలపాతం మూసివేత
ప్రజలను అప్రమత్తంచేసిన ఫారెస్టు అధికారులు

ప్రత్తిపాడు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా ప్రత్తిపాడు మండలం బురదకోట అటవీప్రాంతంలో తిష్టవేసిన పెద్దపులి జాడ గురువారం అటవీ అధికారులకు చిక్కలేదు. ఐదురోజుల క్రితమే బురదకోట అటవీ ప్రాంతానికి వచ్చిన పెద్ద పులి చంపిన లేగదూడ ప్రదేశానికి కూడా రాలేదు. దీంతో పులి జాడ తెలియక అటవీశాఖ అధికారులు, సిబ్బంది గాలింపు ముమ్మరం చేశారు. బురదకోట కేంద్రంగా 3కిలో మీటర్ల పరిసరాల్లో ఏర్పాటుచేసిన ట్రాప్ కెమెరాలను గురువారం పరిశీలించిన పులి ఆచూకీ లభించలేదు. దీంతో అటవీప్రాంతాలను ఆనుకుని ఉన్న సబ్‌ప్లాన్ ఏజెన్సీ ప్రాంతాల్లో ఏ సమయంలోనైనా పులి సంచరించవచ్చని ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఇదిలావుంటే పులి సంచరించే బురదకోట సమీపాన ఉన్న ధారపల్లి జలపాతం వద్దకు పులి రావచ్చనే ముందుజాగ్రత్త చర్యగా ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజ్ అధికారి దుర్గాప్రసాద్ ధారపల్లి జలపాతం మార్గాన్ని మూసివేశారు. ఈ జలపాతం వద్దకు సందర్శకులు రాకుండా మార్గం మూసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ధారపల్లి వచ్చే పర్యాటకుల సంఖ్య తగ్గిపోయింది. పులి హెచ్చరికలకు జలపాతం వద్దకు ఎవరినీ అనుమతించడంలేదు. బాపన్నదొర రైతుకు చెందిన లేగదూడను పెద్దపులి చంపిన ఘటన తరువాత పశువులపై ఎటువంటిదాడి జరిగిన సమాచారం లేదు. చంపిన లేగదూడ కళేబరం వద్దకు పులి రాకపోవడం అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలువల్ల విశ్రాంతి దశలో పులి ఉండవచ్చని గిరిజనులు అభిప్రాయపడుతున్నారు.


ధారపల్లి జలపాతం మార్గాన్ని బంద్ చేసి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

బండిరేవులో దారి దోపిడీ

- స్టేషన్‌కు రమ్మంటూ ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు
- పోలీస్ స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు


దారిదోపిడీకి గురైన ఆదివాసీ యువకులు వీరే

ఎటపాక, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ జరగనిరీతిలో అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలంలోని బండిరేవు గ్రామంలో జాతీయ రహదారిపై బుధవారం రాత్రి సరికొత్త దొంగతనం జరిగింది. కారులో వచ్చి రహదారి పక్కన నిల్చున్న ఇద్దరు ఆదివాసీ యువకుల చేతులు పట్టుకుని, కొంత నగదును, దిచక్ర వాహనం ఎత్తుకెళ్లిన ఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సాలెబుడపు ఆదివాసీ గ్రామానికి చెందిన మడకం దేవయ్య, మడివి ఇర్మా ఇద్దరూ ద్విచక్రవాహనంపై బుధవారంరాత్రి నెల్లిపాక వెళ్తున్నారు. బండిరేవు శివారులో వీరు ద్విచక్ర వాహనం ఆపి ఉండగా, భద్రాచలం వైపు నుంచి చింతూరు వైపు వస్తున్న కారులో నలుగురు వ్యక్తులు వారివద్ద ఆపి, ఇద్దరి యువకులను చేతులమడిసి సెల్‌ఫోన్, కొంత సొమ్ములు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారి ద్విచక్ర వాహనం తీసుకుని చింతూరు వైపు వెళ్లిపోయారు. ఆ గుర్తు తెలియని వ్యక్తులు వెళుతూ రేపు స్టేషన్‌కు వచ్చి, ద్విచక్ర వాహనం తీసుకెళ్లాలని వారికి సూచించారు. కంగుతిన్న యువకులు ఇంతకీ మీరెవరు.. తమ ద్విచక్ర వాహనంను ఎందుకు తీసుకెళ్తున్నారని అడిగితే దౌర్జన్యంగా పక్కకు నెడుతూ, పోలీస్ డిపార్టుమెంట్ అని బెదిరించారని యువకులు చెప్పారు. కాగా ఉదయం ఇద్దరు యువకులు గ్రామ పెద్దల సహకారంతో ఎటపాక, చింతూరు పోలీస్‌స్టేషన్‌లో ఆరా తీయగా, ద్విచక్ర వాహనంను ఎత్తుకెళ్లిన వారు పోలీసులు కాదని నిర్ధారణకు వచ్చారు. దాంతో ఎటపాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటీవల బండిరేవు జాతీయ రహదారిపై ఈ తరహా దారిదోపిడీ ఘటనలు పెరిగాయని, వాహనదారులు, స్థానిక ఆదివాసీలు భయందోళన చెందు తున్నారు. ఇకనైనా పోలీసులు దారి దోపిడీ దొంగలపై నిఘాపెట్టి, చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దివ్యాంగురాలిపై ఫీల్డ్‌అసిస్టెంట్ అత్యాచారయత్నం

కరప, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): తన కుమార్తెపై ఒక వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడినట్టుగా ఒక మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదుచేసినట్టుగా కరప ఎస్ఐ తోట సునీత తెలిపారు. వివరాల్లోకి వెళితే..కరపమండలం వేములవాడ గ్రామానికి చెందిన ఒక మహిళ కేటరింగ్ పనిచేసుకుంటుండగా, ఆమె భర్త హైదరాబాద్‌లో పనిచేసుకుంటున్నాడు. వారికి ఒక కుమారుడు, మానసిక స్థితి సరిగాలేని దివ్యాంగురాలైన ఒక కుమార్తె ఉంది. కాగా గత బుధవారం సాయంత్రం సదరు మహిళ కేటరింగ్ పనికి వెళ్తూ కుమార్తెను చూసుకోమని కుమారుడికి చెప్పింది. రాత్రి 9 గంటల సమయంలో సదరు కుమారుడు ఇంటి నుంచి తన పిన్ని ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో ఉపాధిహామీ పథకం ఫీల్డ్‌అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మట్టపర్తి వీరబాబు ఆపి సినిమాకు వెళదామా అని అడిగాడు. దీనికి మాఅక్క ఒక్కరే ఇంట్లో ఉందని, రావడానికి కుదరదని పిన్ని ఇంటికి వెళ్లిపోయాడు. పిన్నిని తీసుకుని తిరిగి తన ఇంటికి వచ్చేసరికి తలుపులు వేసి దివ్యాంగురాలిపై వీరబాబు అత్యాచారయత్నం చేస్తున్నాడు. దీంతో వారు కంగారుపడి కేకలు వేస్తూ తలుపులు గట్టిగా కొట్టడంతో భయపడిన వీరబాబు అక్కడి నుంచి పరారయ్యాడు. దీనిపై బాధితురాలి తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్టు ఎస్ఐ వివరించారు.

మత్స్యకార వర్గాల్లో
రసాయన పరిశ్రమల మామూళ్ల చిచ్చు

- రెండు వర్గాల మధ్య కొట్లాట


కోనపాపపేట రామాలయం ఆవరణలో సమావేశంలో ఘర్షణపడుతున్న మత్స్యకారులు

కొత్తపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రసాయనాల పరిశ్రమల యాజమాన్యం నుంచి ఒక వర్గానికి చెందిన మత్స్యకారులు రూ.6కోట్లు మామూళ్లు తీసుకున్నారనే విషయంపై గురువారం కోనపాపపేటలో జరిగిన సమావేశం వివాదానికి దారితీసింది. వివరాలు ఇలా ఉన్నాయి. కేఎస్ ఈజెడ్‌లో ఏర్పాటుచేసిన లైఫిజ్ ఫార్మా కంపెనీ నుంచి కోనపాపపేటకు చెందిన బాపన్నదొర, దేముడు అనే వ్యక్తులు రూ.6కోట్లు మామూళ్లు తీసుకున్నారనే అనుమానంపై గురువారం స్థానిక రామాలయంవద్ద మత్స్యకారులు సమావేశమయ్యారు. ఈవిషయం తెలుసుకున్న బాపన్నదొర, అతని సోదరులతోపాటు మరికొంత మంది రామాలయంవద్ద నిర్వహిస్తున్న సమావేశంలోకి వెళ్లి మత్స్యకారుల్లో వేరే వర్గానికి చెందిన చొక్కాప్రసాద్, పేతురులపై దాడి చేయడం, మత్స్యకారులందరూ మూకుమ్మడిగా ప్రతిఘటించడంతో అక్కడి నుంచి వారు వెళ్లిపోయారు. బాపన్నదొర, అతని సోదరులతోపాటు మరికొంత మంది తమపై దాడి చేశారని ప్రకాష్, పేతురు కొత్తపల్లి పోలీసుస్టేషన్‌కు ర్యాలీగా వచ్చి ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జి.వెంకటేష్ చెప్పారు.

మహిళా హోంగార్డుతో అసభ్య ప్రవర్తన

- బొమ్మూరు హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

రాజమహేంద్రవరంసిటీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంరూరల్ మండలం బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ప్రసాద్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. వివరాల్లోకి వెళితే.. పోలీస్ స్టేషన్‌లో నాలుగున్నరేళ్లుగా హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తు న్న ప్రసాద్ ఈనెల 8న రాత్రి విధులు నిర్వర్తిస్తుండగా బయట రౌండ్స్‌కు వెళ్లి తిరిగి అతను తెల్లవారుజామున 2:30కు మద్యంమత్తులో పోలీ స్టేషన్‌కు వచ్చి అక్కడ విధుల్లో ఉన్న మహిళా హోంగార్డుపట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో భయపడి ఇంటికి వెళ్లిపోయిన ఆమె తన భర్తకు విషయంచెప్పి అతన్ని తీసుకుని వచ్చి బొమ్మూరు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ దృష్టికి సమస్యను వివరించడంతో ఆయన ఆదేశాల మేరకు గురువారం ప్రసాద్‌పై కేసు నమోదుచేసి అతన్ని సస్పెండ్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్.యానాంలో ఈనెల 27 నుంచి..
సీనియర్ నేషనల్ ఉమెన్స్ బీచ్ వాలీబాల్ పోటీలు


అమలాపురం పీఆర్ అతిథిగృహంలో అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురంటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎస్.యానాం బీచ్‌ను భవిష్యత్‌లో ఎంతగానో అభివృద్ధి చేసే లక్ష్యంతో ఈనెల 27 నుంచి మూడు రోజుల పాటు సీనియర్ నేషనల్ లెవెల్ ఉమెన్స్ బీచ్ వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రకటించారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో డే అండ్ నైట్ మ్యాచ్‌లను నిర్వహించే విధంగా చేయాల్సిన ఏర్పాట్లపై జిల్లా విద్యాశాఖాధికారి, వ్యాయామ ఉపాధ్యాయులు, వాలీబాల్ పోటీల నిర్వహణ కమిటీ సభ్యులతో గురువారం అమలాపురం పంచాయతీరాజ్ అతిథిగృహంలో ఆనందరావు సమావేశం నిర్వహించారు. బీచ్ వాలీబాల్ పోటీల్లో భాగంగా శుక్రవారం ఉదయం భూమిపూజా కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ పోటీల్లో ప్రధానంగా ఎనిమిది జట్లు పాల్గొంటాయని ఆర్గనైజింగ్ కార్యదర్శి గొలకోటి ఫణీంద్రుమార్ తెలిపారు. టోర్నమెంట్‌ను విజయవంతం చేసేవిధంగా వ్యాయామ ఉపాధ్యాయులందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు పీఎస్ సురేష్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు ఉండ్రు ముసలయ్య, కామన గణేష్, కె.ఈశ్వరరావు, ఎం.రామారావు, మూర్తి పాల్గొన్నారు.

వసతిగృహంలో మద్యం బాటిళ్లతో బీభత్సం

- ఇద్దరు వ్యక్తుల అరెస్టు

పిఠాపురం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): వసతిగృహంలోకి మద్యంమత్తులో బీరుబాటిల్స్ పగులగొట్టి బీభత్సం సృష్టించి విద్యార్థులను బెదిరించి డబ్బులు లాక్కొని పరారైన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్‌లు గురువారం ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పిఠాపురం పట్టణంలోని సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతిగృహంలోకి ఈనెల 9వ తేదీ అర్ధరాత్రి సమయంలో ఇద్దరు వ్యక్తులు మద్యంమత్తులో ఉండి వెనుకవైపు నుంచి లోపలకు ప్రవేశించారు. 8,9,10 తరగతుల విద్యార్థులను బెదిరించి అక్కడే బీరు బాటిల్స్ పగులగొట్టి పొడిచి చంపుతామంటూ భయభ్రాంతులకు గురిచేశారు. వారి వద్దన ఉన్న రూ.540ను లాక్కొని పరారయ్యారు. దీనిపై వసతిగృహ సంక్షేమాధికారి చేసిన ఫిర్యాదు మేరకు పిఠాపురం పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటనకు పాల్పడిన రథాలపేటకు చెందిన పూడి గంగాధర్ అలియాస్ బాలు, కుమారపురం గ్రామానికి చెందిన గుబ్బల దయానందపాల్‌లను గురువారం అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచారు. వీరిపై రౌడీషీట్లు తెరుస్తున్నట్లు సీఐ తెలిపారు. వసతిగృహాలు, పాఠశాలలు, కళాశాలలు వద్ద అలజడులు సృష్టించే వారు, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


బాలుర వసతి గృహంలో విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేసిన వారిని అరెస్టు చూపుతున్న సీఐ, ఎస్ఐలు

ఆర్‌పీఎఫ్ అదుపులో 8మంది బాలలు


బాలలను అదుపులోకి తీసుకున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు

రాజమహేంద్రవరంసిటీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): వివిధ పనుల నిమిత్తం బీహార్, వెస్ట్‌బెంగాల్ రాష్ట్రాల నుంచి ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్న 8మంది బాలలను రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం ఐపీఎఫ్ బి.సైదయ్య, ఏఎస్ఐపీఎఫ్ పి.సత్యనారాయణ, హెచ్‌సీ ఆర్.బాపూజీ, జి.అప్పారావు, కానిస్టేబుల్స్ జె.నారాయణ, కె.మురళీ, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ డీసీపీయూ జి.తిరుపతిరావు, స్టేట్ కోఆర్డినేటర్ బి.చంద్రశేఖర్, ఏపీవో కె.శ్రీకాంత్ రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో శాలీమార్ టూ హైదరాబాద్ వెళ్లే ఈస్ట్‌కోస్టు ఎక్స్‌ప్రెస్‌లో ఈ బాలలను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారిని సామర్లకోట, రాజమండ్రి, విజయవాడ, సికింద్రాబాద్‌లలో పనుల నిమిత్తం బీహార్‌కు చెందిన ఏజెంట్లు దిన సహాని, దీపక్‌కుమార్, హీరా షైక్, లాలాన్‌కుమార్ తరలిస్తున్నారని పోలీసులు తెలిపారు. ఏజెంట్లను అదుపులోకి తీసుకుని బాలల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్టు చెప్పారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

రాజానగరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2020లో జరిగిన కొంతమూరుకు చెందిన తోట కనకదుర్గ హత్యకేసులో నిందితుడు నరసింహరాజుకు కోర్టు జీవిత ఖైదు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరంలోని 5వ సెషన్స్‌జడ్జి కోర్టులో జడ్జి డబ్బిరి విజయ్‌గౌతం తీర్పు ఇచ్చారని రాజానగరం పోలీస్‌లు గురువారం తెలిపారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ శంభుప్రసాద్, పీపీ లక్ష్మణ్‌నాయక్ వాదనలు వినిపించగా కోర్టు కానిస్టేబుల్ దుర్గాప్రసాద్ సహకరించారన్నారు.

భూ బాధితుల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

సామర్లకోట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వ హయాంలో నాటి పాలకులు చేసిన తప్పిదాల వలన భూబాదితులుగా మారిన వారికి సంపూర్ణన్యాయం చేసేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. సామర్లకోట మండలం ఉండూరు పంచాయతీ పరిధిలో ఉండూరు, వల్లూరు, మామిళ్ళదొడ్డి గ్రామాలకు చెంది రెవెన్యూ సదస్సు సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సులో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చినరాజప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయా గ్రామాలలో ఉన్న పలురకాల భూముల గుర్తింపు, వాస్తవ యా జమాన్యం, హక్కుదారులు ఉంటే వారికే న్యాయం చేసేందుకు ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. మరో ముఖ్య అతిథి సామర్లకోట మండల రెవెన్యూ సదస్సుల ప్రత్యేకా ధికారిగా హాజరైన కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు మాట్లాడు తూ రీసర్వే సదస్సులలో భూవిస్తీర్ణంలో తేడాలున్నాయనీ, వాటిని సరిచేయమని అనేక అర్జీలు దాఖలు కావడంతో పునఃప రిశీలన చేసి పూర్వము కన్నా ఇప్పుడు 5 శాతం కన్నా ఎక్కు వగా తేడా ఉన్న వాటిని సరిచేసి ఇరువర్గాల వారికి నోటీసులు ఇచ్చి విచారణ జరిపి రికార్డులు, దస్తావేజులు పరిశీలించి రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ ఉత్తర్వులు పాస్ చేయాలని కింది స్థాయి సిబ్బందిని ఆర్డీవో మల్లిబాబు ఆదేశించారు. అంతకుముందు ఎమ్మెల్యే చినరాజప్పతో కలిసి ఆర్డీవో మల్లిబాబు, తహశీల్దార్ చంద్రశేఖరరెడ్డిలు గ్రామ రెవెన్యూ రికార్డులు, ఎఫ్ఎంబీ, ఫెయిర్ అడంగళ్, నిషేధిత ఆస్తుల రిజిస్టర్ వంటి రికార్డులను పరిశీలించారు. ఈ సదస్సులో బీజేపీ ఇంచార్జి వెంకటరమణ,



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

ఎంపీడీవో కె. హిమమహేశ్వరి, నోడల్ అధికారి రాధాకృష్ణ, డిటీ వై. శ్రీనివాస్, సూపరింటెండెంట్ పద్మజ తదితర వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి కాకినాడ రూరల్లో రెవెన్యూ సదస్సులు

సర్పవరం జంక్షన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలంలో శుక్రవారం నుంచి ఈనెల 27వ తేదీ వరకు జరిగే రెవెన్యూ సదస్సులు విజయవంతానికి అధికారులు కృషి చేయాలని తహశీల్దార్ ఎస్ఎల్ఎన్ కుమారి కోరారు. గ్రామస్థాయిలో భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సద స్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 13న నేమాంలో, 17న పండూరు, 18న తిమ్మాపురం, 19న తమ్మవరం, పెనుమర్తి, 20న చీడిగ, గంగనాపల్లి, 21న రేపూరు, కొవ్వాడ, 24న కొవ్వూరు, తూరంగి,26న సర్పవరం, సూర్యారావుపేట, 27న రమణయ్యపేట, వాకలపూడి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జగన్నాథపురం వంతెన అప్రోచ్ రోడ్డు మూసివేత


జగన్నాథపురం వంతెన అప్రోచ్ రోడ్డు మూసివేసిన అధికారులు

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జగన్నాథపురం కొత్త వంతెన దేవాలయం వీధి రోడ్డుకు అప్రోచ్ రోడ్డు వేయడానికి ఎంతోమంది ఎన్నో రకాలుగా ప్రయత్నించగా చివరికి అప్రోచ్ రోడ్డు నిర్మించారు. దేవాలయం వీధిలోని శివాలయంవద్ద ఏర్పడిన గోతిలో పడి పలు ప్రమాదాలు జరుగుతుండడంతో కార్పొరేషన్ అధికారులు ఏకంగా అప్రోచ్‌రోడ్డునే మూసేశారు. దీంతో వాహనదారులు పాత పద్ధతిలోనే చుట్టూ తిరిగి రావడంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికా రులు ఇప్పటికైనా రోడ్డు మధ్యలో ఏర్పడిన గోతులను పూడ్చి అప్రోచ్ రోడ్డు వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

యాదవ సంఘం బలోపేతానికి కార్యాచరణ

● జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు యనమల కృష్ణుడు


యనమల కృష్ణుడిని సత్కరిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కాకినాడతో పాటు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో యాదవ సంఘం బలోపేతానికి, అభివృద్ధికి కార్యాచరణ చేపడు తున్నట్లు జిల్లా యాదవ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు యనమల కృష్ణుడు అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కుండల సాయికుమార్ యాదవ్, మిత్ర బృందాన్ని గురువారం కాకినాడ డెయిరీఫారమ్ సెంటర్ సమీపంలోని ఆయన నివాసంలో కలిశారు. కాకినాడ వచ్చిన కృష్ణుడికి శాలువాతో సాయికుమార్ సత్కరించారు. యాదవ సంఘం నాయకులు కుండల హేమంత్, మన్నే నాగేశ్వరరావు, నంబారి రమ, కొల్లుబోయిన శ్రీనివాస యాదవ్ పాల్గొన్నారు.

సాగునీటి సంఘాలతో సమర్థవంతమైన పాలన

● ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

తాళ్లరేవు, డిశంబరు 12 (ఆంధ్రజ్యోతి):సాగునీటి సంఘాల ద్వారా రైతులకు సమర్థవంతమైన పాలన అందివ్వాలనే లక్ష్యంతో కూటమి ప్ర భుత్వం పనిచే స్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. గురువారం తాళ్లరేవు టీడీపీ కార్యాలయంలో సాగునీటి సంఘాలఅధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు ఎంపికపై మండల ప్రధానకార్యదర్శి కట్టా త్రి మూర్తులు అధ్యక్ష తన సమావేశం జరిగింది. ఇంజరం సాగునీటి సంఘం అధ్యక్షుడిగా వేగేశ్న భాస్కరరాజు, లచ్చిపాలెం అధ్యక్షుడిగా దాసరి వెంకటరెడ్డి, నీలపల్లి అధ్యక్షుడిగా ధూళిపూడి గోవిందరావు, కోరింగ సాయిరాజు, పోలేకుర్రు అల్లూరి రామకృష్ణంరాజులను రైతులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. పటవల సాగు నీటి సంఘం అధ్యక్షుడిగా బజన సత్తి బాబు, కొత్తూరి కాశీశ్వరుడు మధ్య హోరాహోరీ పోటీ జరిగింది. డీసీ ఛైర్మన్ పదవితో పటవల సాగునీటి ఎన్నిక ముడిపడటంతో 24గంటల్లో స్థానికులతో కమిటీని వేసి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు తెలిపారు. మాజీ ఎమెల్యే చెల్లి వివేకానంద, రాష్ట్ర డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగ సూర్యనారాయణ, మోపూరి వెంకటేశ్వరరావు, పెసింగి ఈశ్వరరావు, వాడ్రేవు వీరబాబు, పొన్నమండ రామలక్ష్మి, రాయుడు గంగాధర్, ఉంగరాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుచ్చిరాజు

కాకినాడసెజ్, సీపోర్ట్‌లను బెదిరించి లాక్కున్నారు

● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ మండిపాటు


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ

కాకినాడ సిటీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో కాకినాడ సెజ్, సీపోర్ట్‌లను గన్ పెట్టి బెదిరించి లాక్కున్నారని, వాటాలుగా విభజించి మాజీ సీఎం జగన్‌రెడ్డి తన బినామీలకు ధారాదత్తం చేసి రైతులకు అన్యాయం చేశారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ మండిపడ్డారు. కాకినాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సెజ్ కోసం సేకరించిన 2వేల ఎకరాల డీనోటిఫికేషన్ భూమిలో 14 ఎకరాల భూమిని మాజీ మంత్రి దాడిశెట్టి రాజా కొనుగోలు చేసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం రైతులకు ఏవిధంగా న్యాయం చేయనుందో తెలియజేసేందుకు వైసీపీ నేతలు దాడిశెట్టి రాజా, వంగా గీత, కురసాల కన్నబాబులకు తాను చాలెంజ్ చేసినా స్వీకరించలేదన్నారు. టీడీపీ, సీఎం చంద్రబాబు ఎప్పుడు రైతుల పక్షాన ఉంటారని, పరిహారం చెల్లించేందుకు త్వరలోనే కమిటీచేసి దోషులను శిక్షించి రైతులకు న్యాయం చేస్తామన్నారు. అరబిందో కాలుష్యం నుంచి మత్స్యకారులను ఆదుకుంటామని చెప్పారు. ఐదేళ్ల మంత్రిగా రాజా నిద్రపోయి ఇప్పుడు రైతులపై కపట ప్రేమ, కన్నీళ్లు కారుస్తుండడాన్ని రైతులు గ్రహించాలన్నారు. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, సత్యానందరెడ్డి, సూరిబాబు, దావీదు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం 1950-2025 అంశంపై వర్క్‌షాప్


వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులతో వర్శిటీ ప్రొఫెసర్లు,రిజిస్ట్రార్

జేఎన్టీయూకే, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వర్శిటీలోని యూసీఈకే మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం పీజీ బ్లాక్ సెమినార్ హాల్లో భారత రాజ్యాంగం 1950-2025 అనే అంశంపై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేఎన్టీయూకే ఎస్సీ, ఎస్టీ లైజనింగ్ అధికారి ఎం.కుమారస్వామి అధ్యక్షత వహించగా నార్త్ అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కామన్ వెల్త్ కరేబియన్ నుంచి కె.కృష్ణమోహన్ ముఖ్యవక్తగానూ, అతిథులుగా రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, జి.అబ్బయ్య, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, డాక్టర్ జి.సత్యనారాయణ, గాయకులు మాస్టర్ జీలు పాల్గొన్నారు. ఈసందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ గత 75 ఏళ్లగా భారతదేశం ప్రపంచంలోనే అ తిపెద్ద ప్రజాస్వామ్యదేశంగా విరాజిల్లుతుందన్నారు. అంతే కాకుండా భారత రాజ్యాంగం ప్రపంచంలోని ఇతరదేశాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, వర్శిటీ, ఐడియల్, కైట్, ఫైడా ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు ఉద్యోగ వేదికగా వనభోజనాలు

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, సచివాలయ ఉద్యోగ వ్యవస్థ, ప్రభుత్వ అనుబంధ ఉద్యోగులు, అధికారులు జి.ఆస్కార్‌రావు, డి.శ్రీకాంత్‌రాజు ఆధ్వర్యంలో శనివారం రాజమహేంద్రవ రం హైవేరోడ్డులో గల పుష్కరవనం వద్ద జరగనున్న ఉద్యోగ వేదికగా వనభోజన కార్యక్రమానికి హాజరుకావాలని కాకినాడలోని ఐసీడీఎస్ పీడీ కార్యాలయంలోని సిబ్బందికి గురువారం ఆహ్వానం అందించారు.


ఆహ్వానపత్రాన్ని పీడీ ఆఫీసులో అందజేస్తున్న శ్రీకాంత్‌రాజు, సిబ్బంది

అగ్రహారంలో ఆర్డీవో పర్యటన

పిఠాపురం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణం అగ్రహారం బైపాస్‌రోడ్డు ప్రాంతంలో కాకినాడ ఆర్డీవో మల్లిబాబు గురువారం పర్యటించారు. అక్కడ ఉన్న ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయంటూ ఇటీవల జిల్లా కలెక్టర్ నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పలు ఫిర్యాదులు రావడం, వాటిపై మునిసిపల్, రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించారు. వీటిని తొలగించేందుకు అధికారులు ప్రయత్నించగా, ఆక్రమణదారులు అడ్డుకోవడంతో వారు వెనుదిరిగారు. ఈ నేపథ్యంలో ఆర్డీవో పరిశీలన జరిపి పరిస్థితులపై ఆరా తీశారు. ఎంత మేర ప్రభుత్వ భూములు ఉన్నాయి, అందులో ఆక్రమణలకు గురయింది ఎంత తదితర విషయాలను అధికారులు ఆర్డీవోకు వివరించారు. ఆర్డీవో వెంట పిఠాపురం తహసీల్దారు వీవీ గోపాలకృష్ణ ఉన్నారు.

పంట కాలువ ఆక్రమణలపై నివేదిక ఇవ్వాలి

సర్పవరం జంక్షన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పంట కాలువలు ఆక్రమణకు ప్రయత్నిస్తే చర్యలు తప్పవని కాకినాడ రూరల్ తిమ్మాపురంలో పంట కాలువను ఇరిగేషన్‌శాఖ పిఠాపురం బ్రాంచ్ కెనాల్ (ఏఈ) శివకృష్ణ హెచ్చరించారు. తిమ్మాపురంలో అచ్చంపేట సెంటర్ సమీపంలో సర్వే నెంబర్ 57లో సుమారు 1300 గజాల స్థలం సమీపంలో గల లేఅవుట్ స్థలాల్లో కలిపేసుకున్నారన్న స్థానికులు ఫిర్యాదు మేరకు గురువారం ఏఈ శివకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి పారుదలశాఖకు చెందిన పంట కాలువ సుమారు 33 లింకుల వెడల్పుతో ఉంటుందన్నారు. తక్షణమే పంట కాలువను సర్వే నిర్వహించి నివేదిక అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. నివేదిక అందిన తర్వాత సంబంధిత యాజమానులకు నోటీసులు జారీ చేస్తామన్నారు. పంట కాలువల ఆక్రమణకు ప్రయత్నిస్తే చర్యలు తప్పవన్నారు. లస్కర్‌లు పంట కాలువల సంరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో లస్కర్ నాగిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సైకిల్ అందజేత

కాకినాడ సిటీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని మునసబుగారి వీధిలో ఉన్న సానా సతీష్‌బాబు ఫౌండేషన్ కార్యాలయంలో పోలీస్ ఉద్యోగానికి కోచింగ్ తీసుకుంటున్న పేద విద్యార్థి పెంకే రవివర్మకు ఫౌండేషన్ తరపున ఛైర్మన్ తలాటం హరీష్ ఉచితంగా సైకిల్ అందజేశారు.


విద్యార్థికి సైకిల్ అందజేస్తున్న దృశ్యం

నాల్గో రోజుకు మున్సిపల్ ఉద్యోగుల సమ్మె

సామర్లకోట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాల్గవ రోజైన గురువారం సామర్లకోట మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ సమ్మె కొనసాగించారు. విధులను బహిష్కరించి మున్సిపల్ కార్యాయలం ఎదుట నిరసన దీక్షలో పాల్గొన్నారు. వర్కర్స్ సమ్మె కారణంగా పట్టణంలో పలు వార్డుల్లో త్రాగునీటి సరఫరాకు తీవ్ర అసౌకర్యం ఏర్పడింది. రాష్ట్ర మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ పిలుపుమేరకు సామర్లకోటలో సామర్లకోట యూనియన్ అధ్యక్షుడు ఉండవిల్లి వి.వి.రామరాజు, కార్యనిర్వాహక కార్యదర్శి పులపకూర రామకృష్ణ, ఉప ప్రధాన కార్యదర్శి కాటంరెడ్డి ఏసు, కోశాధికారి నక్కా రత్నరాజు ఆధ్వర్యంలో 22మంది వర్కర్స్ సమ్మెలో పాల్గొన్నారు. వర్కర్స్ సమ్మె కారణంగా ఇంజనీరింగ్ శాఖలోని వివిధ పనులకు తీవ్ర ప్రతిష్టంబన ఏర్పడింది. యూనియన్ అధ్యక్షుడు రామరాజు విలేకరులతో మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈధర్నాలో చుండ్రు వెంకటరాజేష్, కాకాడ నాగా ర్జున, లంక శ్రీహరి, గరగ స్వామి, మామిడాల కొండబాబు, భాగ్యలక్ష్మి, భూదేవి వెంకట సుబ్ర హ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గల గోదావరి డెల్టా రూపశిల్పి సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి సమ్మెలో ఉన్న ఇంజనీరింగ్ వర్కర్స్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ దీక్షా శిబిరాన్ని సీనియర్ కోఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు సందర్శించి సంఘీభావం తెలిపారు.


నాల్గవ రోజు దీక్షలో కూర్చున్న మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది

రేపు మద్భగవద్గీత అష్టావధానం

పిఠాపురం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణ శివారులోని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో ఈనెల 14వ తేదీ సాయంత్రం శ్రీమద్భగవద్గీత అష్టావధానం నిర్వహించనున్నారు. గీతాజయంతిని పురస్కరించుకుని అష్టావధానంతో పాటు కవిపండితులకు సత్కారాలు ఉంటాయని పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు గురువారం తెలిపారు. తిరుపతి రాష్ట్రీ సంస్కృత విశ్వవిద్యాలయానికి చెందిన అష్టావధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు నేతృత్వంలో కార్యక్రమానికి నరసాపురానికి చెందిన సహస్రవధాని కడిమెళ్ల వరప్రసాద్ సంచాలకులుగా వ్యవహరిస్తారని తెలిపారు. సాయంత్రం 4నుంచి 8గంటల వరకు జరుగుతుందని చెప్పారు.

మేలైన విత్తనాలతోనే అధిక దిగుబడులు


దుంప దిగుబడిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పెద్దాపురం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కర్రపెండలం సాగుచేసే రైతులు మేలైన విత్తన రకాలను శాస్త్రవేత్తల సూచనల మేరకు సాగు చేసుకోవాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్) సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.జగన్నాథం అన్నారు. కట్టమూరు, జె.తిమ్మాపురం గ్రామాల్లో సాగులో ఉన్న దుంప పంటలను ఆయన హార్టీకల్చర్ రీసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్త డాక్టర్ జానకి, సెంట్రల్ ట్యూబర్ క్రాప్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీటీసీఆర్ఐ) శాస్త్రవేత్త పి.ప్రకాష్‌తో కలిసి గురువారం పరిశీలించారు. కర్ర పెండలం సాగులో ఎంపికచేసిన విత్తన రకాలను సాగుచేయడం ద్వారా రైతులు అధిక దిగుబడులను సాధించవచ్చన్నారు. తెగుళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే విత్తన రకాలను శాస్త్రవేత్తలు రైతులకు సూచిస్తారని, తద్వారా పంటలకు చీడపీడలు ఆశించే అవ కాశం తగ్గుతుందన్నారు. నేలల స్వభావాన్ని అనుసరించి ఏఏ రకాల విత్తనాలు సాగుచేసు కోవాలో శాస్త్రవేత్తలు రైతులకు తెలియజే స్తామ న్నారు. అనంతరం స్థానిక గోపాల్ స్టార్చ్ మిల్లును పరిశీలించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది విజయదుర్గ, అమృత వర్షిణి, మంగాజ్యోతి, దుంప రైతులు పాల్గొన్నారు.

అరుణోదయ సభలను విజయవంతం చేయాలి

పెద్దాపురం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఈనెల14,15 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య (ఏసీఎఫ్) 50వ సంతాల సభలను విజయవంతం చేయాలని ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. పట్టణ శివారు దమ్ముపేటలో సభలకు సంబంధించిన కరపత్రాలను ఆయన గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. హైదరాబాద్‌లో ఏర్పాటైన విప్లవ సాంస్కృతిక సంఘం అరుణోదయ సమాఖ్య 50వసంతాలు పూర్తిచేసుకుందన్నారు. కార్పొరేట్ల నిలువుదోపిడీ, మతపరమైన ముసుగు కప్పుతూ దేశంలో రోజు రోజుకూ పెరుగుతున్న ఫాసిస్టు దాడిని ఎదుర్కొనడానికి కార్మిక, కర్షక వర్గాలు సాగించే విప్లవోద్యమంలో విప్లవ సాంస్కృతిక ఉద్యమం కలసికట్టుగా సాగాలని అరుణోదయా భావిస్తోందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దేశెట్టి సురేష్, దుంగపల్లి వెంకయ్యమ్మ, అప్పల వీరబాబు, దుర్గ, వెంకయమ్మ నరసమ్మ, కుమారి పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కర్నాకుల

కేకేఆర్ విద్యార్థులకు కరాటేలో గోల్డ్ మెడల్స్


కరాటేలో గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు

సర్పవరం జంక్షన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఇంటర్నేషనల్ కరాటే అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో స్థానిక జయేంద్రనగర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థులు 7 గోల్డ్ మెడల్స్, 5 సిల్వర్ మెడల్స్ సొంతం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు తెలిపారు. విజయవాడ ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఓపెన్ కరాటే చాంపియన్ షిప్-2024లో 5వ తరగతి విద్యార్థి పి.సాయిసూర్య కుమితే, కట, నోన్ చాక్ విభాగాల్లో 3 గోల్డ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. అలాగే 5వ తరగతి విద్యార్థి ఎన్ ధనేష్ గగన్ కట, టీమ్ కట విభాగాల్లో 2 గోల్డ్‌మెడల్స్, 6వ తరగతి విద్యార్థి కె వినయ్ కట, టీమ్ కట విభాగాల్లో 2 గోల్డ్ మెడల్స్ సాధించారన్నారు. 7వ తరగతి విద్యార్థి సాయి వెంకట సోమపవన్ కట, కుమితేలో 2సిల్వర్ మెడల్స్, ఎన్ ధనేష్ గగన్ కుమితేలో సిల్వర్, వినయ్ కుమితేలో సిల్వర్ మెడల్స్ సాధించడం జరిగిందన్నారు. విద్యతో పాటూ జాతీయ స్థాయి కరాటేలో రాణించిన విద్యార్థులను విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ కేకే ఆశ, డైరెక్టర్ అవినాష్‌లు అభినందించారు. జాతీయస్థాయిలో విద్యార్థులు గోల్డ్‌మెడల్స్ సాధించేలా శిక్షణ ఇచ్చిన పీడీ మనోహర్‌ని అభినందించారు.

వైభవంగా సహస్ర లిల్లీపుష్ప పూజ


శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో శ్రీపాదశ్రీ వల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహా సరస్వతులకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పిఠాపురం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రసిద్ధిగాంచిన పిఠాపురం పట్టణంలోని శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానంలో జరుగుతున్న శ్రీపాద జయంతి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా గురువారం అయిదవ రోజు సహస్ర లిల్లీపుష్పపూజ జరిగింది. శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులకు పుష్పాలతో ప్రత్యేక అలంకారం చేశారు. అంతకుముందు మహాగణపతి పూజ, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాదపద్మములకు మహాన్యాసపూర్వక ఏకాదశ శతరుద్రాభిషేకం, రుత్విక్కులతో దత్తమూలమంత్ర అనుష్టానము, సాయంత్ర అగ్నిప్రతిష్టాపన, దత్తమంత్ర హోమం, వివిధ హారతులు. స్వామికి పల్లకిసేవ నిర్వహించారు. ఆలయ ఈవో ఆర్‌సౌజన్య తదితరులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

నేడు హనుమద్వ్రత పూజలు

సామర్లకోట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సామర్లకోటలో కంచి మహాసంస్థానంలో ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం వద్ద శుక్రవారం హనుమద్వ్రత పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక కుటుంబీకులు చంద్రాభట్ల పతంజలి చెప్పారు. గురువారం రాత్రి ఆలయం వద్ద పూజలకు ఏర్పాట్లు పతంజలి పరిశీలించారు.

అక్రమ లేవుట్‌లో నోటీసు బోర్డు ఏర్పాటు

తాళ్లరేవు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట సర్వేనెం.363/1లో ఎకరం భూమిలో చేసిన అక్రమ నాన్ లేవుట్‌లో స్థలాలను అమ్మకాలు, కొనుగోలు చేయరాదని చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని నోటీసుబోర్డును స్థానిక పంచాయతీ కార్యదర్శి వేణుగోపాలరావు ఏర్పాటు చేశారు. నిబంధనలను అతిక్రమించడంతో క్రిమినల్ చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.



పాదగయలో దత్తాత్రేయుడికి నారీకేళి అర్చన

పిఠాపురం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో స్వయంభుమూర్తిగా వెలసిన దత్తాత్రేయస్వామి దత్తజయంతి సప్తాహమహోత్సవాల్లో భాగంగా గురువారం నాలుగవ రోజు నారీకేళీ అర్చన నిర్వహించారు. సాయంత్రం లక్ష బిల్వార్చన జరిగింది. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అర్చన జరిపించి దత్తాత్రేయస్వామిని అలంకరించారు. మహాగణపతిపూజ, కలశస్థాపనలు, రుత్విక్‌వరణములు, పంచామృతాభిషేక సహిత రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, రుత్విక్కులతో దత్తమాల మంత్ర అనుష్టానం, అగ్నిప్రతిష్టాపన, దత్తమూల మంత్రహోమాదులు, మంగళహారతి నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, సూపరింటెండెంట్ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.


దత్తాత్రేయస్వామికి నారీకేళీ అర్చన నిర్వహించిన దృశ్యం

పాత్రికేయుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ పిఠాపురం లోగోను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి

పిఠాపురం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పాత్రికేయుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావులు తెలిపారు. పిఠాపురం పట్టణ శివారు నరసింగపురం రోడ్డులో గురువారం జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ పిఠాపురం ఆత్మీయ సమావేశం జరిగింది. నియోజకవర్గంలోని పాత్రికేయులు పాల్గొన్న కార్యక్రమంలో అసోసియేషన్ లోగోను వారు ఆవిష్కరించారు. సమాజంలో చైతన్యం తీసుకువచ్చేందుకు పాత్రికేయులు చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో కాకినాడ మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు మాదిగల ఆత్మీయ సమ్మేళనం

తొండంగి డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నూజివీడులో శుక్రవారం జరిగే మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు కొండే పూడి శ్యాంబాబు మాదిగ పిలుపునిచ్చారు. పెదపూడి గవరయ్య అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో భాగంగా ఆయన కార్యకర్తలతో మాట్లాడారు. అరగుల మోషే, కాకాడ సింగన్న, డొక్కా అజయ్‌బాబు, అరుగుల కృష్ణ, తమ్మలపల్లి కుమార్, ఎం.ఏసు, చిలకబాబు, జయరాజు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

హైస్కూల్ ప్లస్ పేరును జిల్లా పరిషత్ జూనియర్ కాలేజీగా మార్చాలి

జగ్గంపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏపీ పోస్టుగ్రాడ్యుయేట్ టీచర్స్ అసోసియేషన్ శుక్రవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూని కలిసింది. ప్రస్తుతం కొనసాగుతున్న హైస్కూల్ ప్లస్ పేరును జిల్లా పరిషత్ జూనియర్ కాలేజీగా మార్చాలని వినతిపత్రం అందజేశారు. సీనియర్ ఉపాధ్యాయుడు బీవీ కామరాజ్‌కుమార్ మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా డిప్లయ్‌మెంట్‌పై పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లను శాశ్వత ప్రాతిపదికన జూనియర్ లెక్చరర్లుగా నియమించాలన్నారు. నాలుగు గ్రూపులు ఏర్పాటుచేసి కో-ఎడ్యుకేషన్ కాలేజీగా మార్చాలన్నారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రభుత్వానికి నివేదిక పంపించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వెంకటేశ్వరరావు, ధర్మరాజు, నానిబాబు, సత్యవతి, రాము, లక్ష్మీనారాయణ, తపనం సూర్యనారాయణ, అచ్చన్న తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గంపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట-కాట్రావులపల్లి 33 కేవీ లైన్‌పై చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ బి.వీరభద్రరావు తెలిపారు. మండలంలోని కాట్రావులపల్లి, సూరంపాలెం, సీతానగరం, యర్రంపాలెం గ్రామాలతో పాటు వ్యవసాయ బోర్లకు ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

19న తొండంగి మండల సమావేశం

తొండంగి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తొండంగి మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 19న నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో రాజేశ్వరరావు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ సువర్ణలత అధ్యక్షతన జరిగే సమావేశానికి మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకావాలని ఆయన కోరారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

16 గురుకులాల్లో స్తంభించిన బోధన

ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమ్మెతో పదవ తరగతి విద్యార్థులకు ఇబ్బంది

ఇతర విద్యా సంస్థల నుంచి ఉపాధ్యాయులను రప్పిస్తున్న అధికారులు

రంపచోడవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమ్మెతో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 16 గురుకుల విద్యాలయాల్లో బోధన స్తంభించింది. ముఖ్యంగా ఈ విద్యాలయాల్లో పదో తరగతి విద్యార్థులకు ముఖ్యమైన సబ్జెక్టులు బోధించేవారు కరువయ్యారు. రాష్ట్రంలో గురుకుల విద్యాలయాల నిర్వహణ, ఆయా పోస్టుల భర్తీని గురుకుల విద్యా సొసైటీ ప్రత్యేకంగా నిర్వహిస్తుంది. కాగా ఈ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న చాలా ఉపాధ్యాయ పోస్టులకు రెగ్యులర్ రిక్రూట్‌మెంట్ చేపట్టకపోవడంతో దాదాపు ఔట్ సోర్సింగ్ విధానంలోనే భర్తీ చేశారు. ఎన్నో సంవత్సరాలుగా ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులుగా కొనసాగుతున్నారు. వీరు తమను ఆయా పోస్టుల్లో రెగ్యులర్ చేయాలని కోరుతూ వచ్చారు. మినిమం టైం స్కేల్ అయినా వర్తింపజేయాలని కోరారు. గురుకుల విద్యాలయాల ఉపాధ్యాయ పోస్టులను కూడా డీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేయడంతో ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు ఆందోళన బాట పట్టారు.

రాష్ట్రవ్యాప్తంగా 127 గురుకుల విద్యాలయాల్లోని 1,034 మంది ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు సమ్మెలో పాల్గొనగా అల్లూరి జిల్లాలోని 16 విద్యాలయాలకు చెందిన 210 మంది పాల్గొంటున్నారు. వీరిలో 80 మంది ఉపాధ్యాయులు 10వ తరగతి బోధిస్తున్న వారు ఉన్నారు. వీరి సమ్మెతో ఎదురైన ఇబ్బందులను ఎదుర్కొనే దిశగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, జిల్లా పరిషత్ పాఠశాలల నుంచి కొందరు ఉపాధ్యాయలను గురుకులాలకు రప్పించి బోధన జరిపించే ఏర్పాట్లను ప్రభుత్వం చేపట్టింది.

గురుకుల విద్యాలయాల నిర్వహణ అంశం ప్రత్యేక వ్యవస్థగా నడుస్తుందని అధికార యంత్రాంగానికి తెలిసినా ఈ అంశాన్ని సంబంధిత ఉన్నతాధికారులు ప్రభుత్వానికి సరైన పద్ధతిలో వివరించలేదు. ఇది గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యకు పరోక్షంగా కారణమైంది. కాగా ప్రభుత్వం కూడా ఈ అంశంపై స్పందించి తగు చర్యల ద్వారా సమస్యను పరిష్కరించాలని భావిస్తోంది.



వివరాలు వెల్లడిస్తున్న చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా

కారు దగ్ధం కేసులో వీడిన మిస్టరీ

చింతూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం సరివెల సమీపంలో కారు దగ్ధం ఘటనలో మిస్టరీ వీడింది. దీనికి సంబంధించిన పూర్వాపరాలను చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా గురువారం వెల్లడించారు. ఎటపాక మండలం నెల్లిపాకకు చెందిన గుంటుపల్లి మనోజ్, చెక్క గణేష్ కలప స్మగ్లర్లు. వీరు చింతూరు మండలం పేగలో సోడె నాగయ్య వద్ద టేకు కలప కొనుగోలు చేశారు. దుంగలను కారులో లోడు చేసుకుని భద్రాచలం బయల్దేరారు. వారి వెనుకనే ద్విచక్ర వాహనంపై సోడె నాగయ్య ఎస్కార్ట్‌గా బయల్దేరాడు. దారిలో ఓ దుకాణం వద్ద స్మగ్లర్లు నాగయ్య ద్విచక్ర వాహనం కోసం రెండు సీసాల పెట్రోలు కొనుగోలు చేశారు. అక్కడి నుంచి కొద్ది దూరం వెళ్లాక నాగయ్య కోసం స్మగ్లర్లు కారు ఆపారు. ఈలోపు సిగరెట్ కాల్చేయత్నం చేశారు. పెట్రోలు సీసా మూత ఊడి ఉన్న విషయం గుర్తించక అగ్గిపుల్ల వెలిగించడంతో క్షణాల్లో కారులో మంటలు చెలరేగాయి. దీంతో కారు పూర్తిగా దగ్ధమైంది. స్మగ్లర్లు, ఎస్కార్ట్ పరారయ్యారు. సీఐ తెల్లం దుర్గాప్రసాద్, ఎస్ఐ పి.రమేష్ బృందాలుగా వీడి కారు దగ్ధం మిస్టరీని ఛేదించారు. ఇది మావోయిస్టుల పనికాదని స్పష్టమైంది. ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు ఏఎస్పీ వెల్లడించారు.

గంజాయి స్మగ్లింగ్‌పై నిఘా పెంచాం: ఏఎస్పీ

చింతూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గంజాయి స్మగ్లింగ్‌పై నిఘా పెంచామని చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా పేర్కొన్నారు. గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన గంజాయి స్మగ్లింగ్ నియంత్రణకు చేపట్టిన చర్యలను వివరించారు. గంజాయి సాగును పసిగట్టేందుకు డ్రోన్‌లను వినియోగిస్తున్నామన్నారు. స్మగ్లర్లు ఎన్ని రూట్లు మార్చినా తమ చేతికి చిక్కడం తప్పదన్నారు. ఈ మేరకు సరిహద్దు రాష్ట్రాల పోలీసులకు సమాచారం ఇచ్చిపుచ్చుకుంటున్నామన్నారు. రహదారులపై చెక్ పోస్టులను ఏర్పాటు చేయడంతో పాటు గూఢచార వ్యవస్థను పటిష్ఠం చేశామన్నారు. సమావేశంలో ఎటపాక సీఐ కన్నపరాజు, కూనవరం ఎస్ఐ లతాశ్రీ పాల్గొన్నారు.

'నూరు శాతం ఉద్యోగాలు ఆదివాసీలకే కేటాయించాలి'

చింతూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో నూటికి నూరు శాతం ఉద్యోగాలను ఆదివాసీ యువతకే కేటాయించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. చింతూరు ఐటీడీఏ ఎదుట ఆదివాసీలు చేపట్టిన దీక్ష గురువారం మూడో రోజుకు చేరుకుంది. ఐటీడీఏ పీవో అపూర్వభరత్ దీక్షా శిబిరం వద్దకు వచ్చి ఆదివాసీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను, డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆదివాసీలు దీక్షను విరమించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జీవో నెం.3 రద్దు చేయడం, మైదాన ప్రాంత గిరిజనేతరులను మన్యానికి డిప్యుటేషన్‌పై బదిలీ చేయడం లాంటి చర్యలతో ఆదివాసీ యువత తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందన్నారు. ప్రత్యేక డీఎస్సీ నిర్వహించి ఆదివాసీలతో మన్యంలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పూనెం చిన్న వీరభద్రం, పులి వీరయ్య, ఉమ్మాల దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూనవరం పంచాయతీలో డీఎల్పీవో విచారణ

కూనవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కూనవరం మేజర్ పంచాయతీలో కార్యకలాపాలపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో రంపచోడవరం డీఎల్పీవో నరసింగరావు గురువారం విచారణ నిర్వహించారు. పలు ఫైళ్లను పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని ఆయన చెప్పారు. పంచాయతీలో పనుల తీరు, నిధుల వినియోగంపై సంతృప్తి వ్యక్తం చేశారు.



ఫైళ్లు పరిశీలిస్తున్న డీఎల్పీవో

15న ఆదివాసీ ఉద్యోగుల సంఘం జిల్లా ఎన్నికలు

అడ్డతీగల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరంలోని ఆదివాసీ భవనంలో ఈ నెల 15వ తేదీన ఆదివాసీ (గిరిజన) ఉద్యోగుల సంక్షేమ, సాంస్కృతిక సంఘం జిల్లా ఎన్నికలు నిర్వహిస్తున్న తాత్కాలిక కమిటీ ప్రధాన కార్యదర్శి సమర్త కృష్ణ తెలిపారు. వివిధ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మేధావులు హాజరై ఓటు హక్కు వినియోగించుకోవాలని తాత్కాలిక కమిటీ ప్రతినిధులు సూచించారు.

'కూటమి నాయకులు ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలి'

రంపచోడవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మన్యంలో ఆ పార్టీల నాయకుల అక్రమాలు పెరిగిపోయాయని, వాటిని ఆపి ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే ఎన్.ధనలక్ష్మి కోరారు. గురువారం రంపచోడవరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె కూటమి ప్రభుత్వంలో నాయకుల అక్రమాలను వివరించారు.



అన్నప్రసాదం స్వీకరిస్తున్న కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు

రామచంద్రపురంలో అన్నసమారాధన

కిర్లంపూడి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రపురం గ్రామంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం మహా అన్నసమారాధన నిర్వహించారు. సర్పంచ్ తుమ్మలపల్లి సాయిగుణశేఖర్ ఆధ్వర్యంలో జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, తుమ్మలపల్లి సాయి చందు ఏర్పాట్లను పర్యవేక్షించారు. దాదాపు 20వేల మందికి పైగా భక్తులు హాజరయ్యారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఉభయ గోదావరిజిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ తుమ్మల బాబు, మేడా గురుదత్తప్రసాద్ హాజరై అన్నప్రసాదం స్వీకరించారు.



27 అంకె ఆకారంలో కూర్చుని నిరసన తెలుపుతున్న జీడిపిక్కల పరిశ్రమ కార్మికులు

కార్మికుల వినూత్న నిరసన

ఏలేశ్వరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమను రాత్రికి రాత్రి మూసెయ్యడంతో ఉపాధి కోల్పోయామంటున్నారు జీడిపిక్కల పరిశ్రమ కార్మికులు. వారు చేస్తున్న ఆందోళన 27 రోజులు పూర్తి కావడంతో గురువారం పరిశ్రమ గేటు వద్ద మహిళలు 27 అంకె రూపంలో కూర్చుని వినూత్నంగా నిరసన తెలిపారు. యాజమాన్యం స్పందించి ఉపాధి కోల్పోయిన 409 మంది కార్మికులకు పరిహారం చెల్లించాలన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె విరమణ

తుని రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): న్యాయపరమైన హక్కులను నెరవేర్చాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న మున్సిపల్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమ్మె విరమించారు. జీతాలు పెంపుపై చర్చించేందుకు కమిషనర్ పిలుపునిచ్చారు. దీంతో విధులకు హాజరవుతున్నట్టు కమిషనర్‌కు లేఖ అందజేశారు.



విధులకు హాజరవుతున్నట్టు లేఖ ఇస్తున్న కార్మికులు

మద్యం తాగి వాహనం నడిపిన డ్రైవర్‌కు 15 రోజులు జైలు

అన్నవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి ప్రమాదకరంగా వాహనం నడిపిన డ్రైవర్‌కు మేజిస్ట్రేట్ 15రోజులు జైలు శిక్ష విధించారు. ప్రత్తిపాడు నుంచి అన్నవరం వైపు వస్తున్న ఏపీ 39వీయూ 9198 లారీ డ్రైవర్ పూర్తిగా మద్యం మత్తులో ప్రమాదకరంగా డ్రైవింగ్ చేస్తుండగా గమనించిన ఒక వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అన్నవరం ఎస్ఐ హరిబాబు సిబ్బందితో లారీని చేజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి కాటం భాను 15 రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో యజమాన్యం

క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్‌లో 50 మందికి ఉద్యోగాలు

ఎటపాక, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ పాల్‌రాజ్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఎస్‌వీఆర్ హ్యూమన్ క్యాపిటల్ సొల్యూషన్స్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈఈఈ, ఎంఈ, ఈసీఈ బ్రాంచ్‌ల బీటెక్, డిప్లొమా విద్యార్థులు 200 మంది పాల్గొనగా 50 మంది ఎంపికైనట్టు కళాశాల సెక్రటరీ జకరయ్య తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నెలలో నాలుగు ప్రముఖ ఎంఎన్‌సీ కంపెనీలతో మరొక క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు జకరయ్య చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ హతిరామ్, చైర్మన్ వరలక్ష్మి, కరస్పాండెంట్ రాజశేఖర్ పాల్గొన్నారు.



లోగోను ఆవిష్కరిస్తున్న చినజీయర్ స్వామి

ఎంఎంకేఆర్ చారిటబుల్ ట్రస్టు ప్రారంభం

ప్రత్తిపాడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో డీసీసీబీ మాజీ డైరెక్టర్ ముదునూరి మురళీకృష్ణంరాజు పేరిట నూతనంగా ఏర్పాటుచేసిన ఎంఎంకేఆర్ చారిటబుల్ ట్రస్టు లోగోను త్రిదండి శ్రీమన్నారాయణ జీయర్ స్వామి గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అహోబిల రామానుజ జీయర్ స్వామి, జువ్వల దొరబాబు, బొల్లు నాగేశ్వరరావు, మాగాపు శివ తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న రామకృష్ణుడు

'రైతుల సమస్యలు తెలిసిన వారికే సాగునీటి సంఘాల ఎన్నికల్లో చోటివ్వాలి'

తుని రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలు తెలిసిన వారికే సాగునీటి సంఘాల ఎన్నికల్లో చోటిచ్చేందుకు నాయకులు చొరవ చూపాలని, మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు కోరారు. గురువారం ఆయన తేటగుంటలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో తుని నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులతో సమావేశమయ్యారు. గ్రామాల్లో పరిస్థితులు, అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. యనమల రాజేష్, చింతమనీడి నాగ సోమరాజు (అబ్బాయి), గాడి రాజబాబు, అంకంరెడ్డి రమేష్, దంతులూరి శ్రీనివాసరాజు, కుర్ర వెంకటరమణ, కొయ్య కేశవ, కుసుమంచి సత్యనారాయణ, మల్ల గణేష్, కొక్కడుపు బాలాజీ, ఆరుగల నరసింహం తదితరులు పాల్గొన్నారు.



గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ సత్యనారాయణ

హౌసింగ్ లే-అవుట్ పరిశీలన

తొండంగి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.కొత్తపల్లి హౌసింగ్ లే-అవుట్‌ను ఆ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ గురువారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సహకారంతో త్వరితగతిన ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలపై సిబ్బందిని ప్రశ్నించారు. లబ్ధిదారులను చైతన్యపరిచి నిర్మాణాలు వేగంతంగా జరిగేలా చూడాలని సూచించారు. లే-అవుట్‌లో కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. పీడీ వెంట ఎంపీడీవో రాజేశ్వరరావు, హౌసింగ్ ఈఈ గుప్తా, డీఈ శ్రీనివాస్, ఏఈ ఆనంద్ ఉన్నారు.

రెవెన్యూ సదస్సులో 37 దరఖాస్తులు

ప్రత్తిపాడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బవురువాక, తాడువాయి, దోపర్తి గ్రామాల్లో తహసీల్దారు ఎం.సూర్యప్రభ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. 37 దరఖాస్తులు అందాయి. బవురువాకకు చెందిన రైతులు కిలిమి రాధాకృష్ణ, కించు రాంబాబు దరఖాస్తులను ఆన్‌లైన్ చేసిన వెంటనే వారికి 1-బి దరఖాస్తులు మంజూరు చేసినట్టు తహసీల్దారు ఎం.సూర్యప్రభ, సర్పంచ్ సత్యనారాయణ వెల్లడించారు. ఆర్ఐ గోపాలకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బూత్ కమిటీల అధ్యక్షులు వీరే

ఏలేశ్వరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జె.అన్నవరం, తూర్పులక్ష్మీపురం గ్రామాలకు జంగారెడ్డి వీరభద్రరావు, మీసాల వీరబాబు, పతివాడ వెంకటేశ్వరరావులను బీజేపీ బూత్ కమిటీలకు అధ్యక్షులుగా నియమించారు. గురువారం వారికి ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు, మండల అధ్యక్షుడు కూరావుల రాజా నియామక పత్రాలు అందజేశారు.



డాక్టర్ చిన్నారావుకు అరుదైన గౌరవం

తుని రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తుని గ్రామీణ ప్రాంతమైన దొండవాక వాసి, విద్యావేత్త డాక్టర్ చిన్నారావుకి అరుదైన గౌరవం దక్కింది. స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణకు చిన్నారావుకి రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానం పలికింది. నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంపై తన అభిప్రాయాన్ని శుక్రవారం అమరావతిలో వెల్లడిస్తానని డాక్టర్ చిన్నారావు మీడియాకు తెలిపారు. ఆయనకు పలువురు రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల నేతలు అభినందనలు తెలిపారు.